PRAJASAKTI Regd.No. 15795/68 సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 26 | విజయవాడ, శనివారం 26 ఆగస్టు 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 26 August 2023 | Rs

రూ.300 కోట్ల ఇఎస్ఐ కుంభకోణం కేసులో

ఛార్జిషీటు దాఖలు

లోపలి పేజీలో..



జావెలిన్ త్రో ఫైనల్‌కు నీరజ్..

- పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత
- ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

లోపలి పేజీలో



కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం జగన్, కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్

గిరిజనులకు ప్రపంచస్థాయి ఉన్నత విద్య

గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

గిరిజనులకు ప్రపంచ స్థాయి ఉన్నత విద్య అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో గిరిజనులు ప్రపంచంతో పోటీ పడతారని పేర్కొన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ మండలం చినమేడపల్లిలో 561.88 ఎకరాల్లో రూ.834 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి జగన్, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం దత్తిరాజేరు మండలం మరడాం వద్ద జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మూడేళ్లలో ఈ యూనివర్సిటీ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా మంజూరైన ఈ వర్సిటీ గిరిజనుల జీవితాలను మలుపు తిప్పుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజనుల కోసం ప్రత్యేక జిల్లాలను ఏర్పాటు చేయడంతోపాటు, వైద్యారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పార్వతీపురం, పాడేరు, నర్సీపట్నం కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నామని, కురుపాం నియోజకవర్గంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ నిర్మాణం జరుగుతోందని వివరించారు. నామినేటెడ్ పదవులు, ఉద్యోగాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 50 శాతం కేటాయించే విధంగా ప్రత్యేక చట్టం చేశామన్నారు. 1,53,820 గిరిజన కుటుంబాలకు 3,22,538 ఎకరాల సంబంధించి ఆర్ఒఎఫ్ఆర్ డికెటి పట్టాలు మంజూరు చేశామని తెలిపారు. గిరిజన రైతులకు రైతు భరోసా వర్తింపజేశామన్నారు. రాజ్యాంగం ప్రకారం గిరిజనులకు సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం ఐదుగురు సభ్యులతో ప్రత్యేక ఎస్‌టి కమిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనల కేంద్రంగా సిటియు : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీని క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. వర్సిటీ ఏర్పాటు ద్వారా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం మెరుగుపడతాయన్నారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్‌లో కూడా కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉందన్నారు. ఈ రెండు యూని వర్సిటీలూ పరస్పర సహకారంతో గిరిజన విద్యాభివృద్ధికి కృషి చేస్తాయని పేర్కొన్నారు. జాతీయ విద్యావిధానంలో భాగంగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోన్న విద్యా సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయన్నారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో బోధించడం భాషాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో పని చేస్తున్నాయన్నారు. సభలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రసంగించారు. బొత్స సత్యనారాయణ సహా పలువురు మంత్రులు, అరకు ఎంపి జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

వాన్‌పిక్ కేసులో

యథాతథ స్థితి

- సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వాడరేవు - నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ (వాన్‌పిక్) కేసు విషయంలో యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. వాన్‌పిక్ ఏర్పాటుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రస్ అల్ ఖైమాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రస్తుత సిఎం జగన్ మోహన్ రెడ్డిపై నమోదైన అక్రమాస్తుల కేసుల విచారణ సమయంలో వాన్‌పిక్ సేకరించిన 13,321 ఎకరాల భూములను ఇడి జప్తు చేసింది. భూముల జప్తును సవాల్ చేస్తూ వాన్‌పిక్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, జప్తు నుంచి భూములు విడుదల చేయాలంటూ తెలంగాణ హైకోర్టు గత ఏడాది సెప్టెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వులను ఇడి సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం పిటిషన్‌ను విచారణ చేపట్టింది. ఇప్పటికే 15 ఏళ్లు వృథాగా గడచిపోయాయని, ఇందులో దేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన అంశం ముడిపడి ఉందని వాన్‌పిక్ తరపు న్యాయవాదులు వాదించారు. విచారణలో జాప్యం కారణంగా ప్రాజెక్టు ముందుకు కదలడం లేదని తెలిపారు. ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్ ఉంటే దానిపై విచారణ జరపొచ్చని, కానీ మొత్తం ప్రాజెక్టు భూములను ఇడి అటాచ్ చేయడం తగదని పేర్కొన్నారు. ఈ వాదనల అనంతరం వాన్‌పిక్ సంస్థకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని ఉత్తర్వులు ఇస్తూ కేసు విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ, ఉత్తర్వులు ఇచ్చే వరకు 'స్టేటస్ కో' అమలు చేయాలని సుప్రీం ఆదేశించింది.

బిజెపి ఓటమే లక్ష్యం

దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి ముప్పు

ఫెడరలిజం, సామాజిక న్యాయానికి విఘాతం : బివి రాఘవులు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి, పెదనందిపాడు

దేశంలో రాబోయే ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపడమే లక్ష్యంగా 26 పార్టీలు కలిసి ఇండియా పేరుతో ఒకే తాటిపైకి వచ్చాయని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు తెలిపారు. బిజెపి మళ్లీ గెలిస్తే దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం పూర్తిగా మంటగలసిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో ఒక్కో పార్టీకి ఇతర పార్టీలతో రాజకీయ వైరుధ్యాలు ఉన్నా బిజెపిని ఓడించడం కోసం 26 పార్టీలు ఒక తాటిపైకి వచ్చాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. గత తొమ్మిదిన్నరేళ్లలో దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదానికి ముప్పు వాటిల్లుతోందని, ఫెడరలిజానికి, సామాజిక న్యాయానికి తీవ్ర విఘాతం కలుగుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయిలో బిజెపిని ఓడించడమే లక్ష్యంగా బెంగళూరులో జరిగిన ప్రతిపక్షాల సమావేశం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బిజెపి ఇప్పటికే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక అంశాలను కాలరాసి మనుధర్మ శాస్త్రం ఆధారంగా మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాంతీయ పార్టీలను, మీడియాను లొంగదీసుకోవడానికి రాజ్యాంగ వ్యవస్థను మోడీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, ఇడి ద్వారా ప్రతిపక్ష పార్టీలను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతీయ పార్టీలు బిజెపికి అనుకూలంగా ఉండడం వల్ల ఇక్కడ ఎటువంటి ఇడి దాడులూ జరగడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వాల అవినీతిని పట్టించుకోవడం లేదని తెలిపారు. కర్ణాటకలో గత ప్రభుత్వం హయాంలో బిజెపి నాయకులు 40 శాతం వాటాలు తీసుకున్నట్టు బహిరంగంగా ఆరోపణలు వచ్చినా మోడీ మౌనంగా ఉన్నారని గుర్తు చేశారు. చంద్రయాన్-3 విజయవంతం కాగానే నిమిషాల్లో స్పందించిన ప్రధాని మోడీ... మణిపూర్ అల్లర్లపై మాత్రం స్పందించడం లేదని, లోక్‌సభలో అవిశ్వాసం ప్రవేశపెట్టినా జోకులతో కాలయాపన చేశారని అన్నారు. ఢిల్లీలో సెప్టెంబరులో జరిగే జి-20 దేశాల సదస్సును కూడా తనకు అనుకూలంగా మార్చుకుని వచ్చే ఎన్నికల్లో ఒక ప్రచార అస్త్రంగా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వాతావరణంలో వస్తోన్న మార్పులు, పర్యావరణానికి ఏర్పడిన ముప్పు తదితర అంశాలపై చర్చించేందుకు ఇటీవల పలువురు మేథావులు ఢిల్లీలో వుయ్-20 పేరుతో సదస్సు నిర్వహించేందుకు ప్రయత్నించగా, 3,000 మంది పోలీసులతో కేంద్ర ప్రభుత్వం అడ్డుకొనే ప్రయత్నం చేసిందన్నారు. ఈ సదస్సుకు హాజరైన విద్యావేత్తలు, డాక్టర్లు, మేధావులు జి-20 సదస్సులో పర్యావరణాన్ని కాపాడే అంశంపై చర్చించాలని, ఆయా దేశాల్లో అంతర్గత ఘర్షణలు నివారించాలని, వాతావరణ సమతుల్యతకు ముప్పు రావడం వల్ల ఏటా కొన్ని వేల జాతులు అంతరించిపోతున్నాయని... వీటిపై దృష్టి సారించాలని కోరారని తెలిపారు. జి-20 సదస్సు నేపథ్యంలో ప్రపంచం అంతా వసుదైక కుటుంబం నినాదాన్ని తెరపైకి తెచ్చిన మోడీ... భారతదేశాన్ని వసుదైక కుటుంబంగా ఎందుకు ప్రకటించడంలేదని ప్రశ్నించారు. ముస్లిములను లక్ష్యంగా చేసుకుని ఏకరూప పౌరస్మృతిని తెరపైకి తెచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో మతపరంగా ప్రజల్లో అలజడి రేపేందుకు ఈ అంశాన్ని బిజెపి వాడుకొనేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చకూడదని 1973లో మిగతా 2లో



తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభోత్సవంలో బి.వి.రాఘవులు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, పిన్నమనేని రామకృష్ణ, పాశం రామారావు తదితరులు (వార్త 2లో)

వేరుశనగ సబ్సిడీ పక్కదారి!

- సీడ్ పంపిణీ చేయకుండానే చేసినట్లు రికార్డులు
- రైతుల వేలిముద్రలు హైజాక్
- వ్యవసాయశాఖ, సప్లయర్స్ కుమ్మక్కు
- ఉమ్మడి అనంతలో అక్రమాలు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

వర్షాభావం, సేద్యంపై రైతుల అనాసక్తి పరిస్థితులను తమకనుకూలంగా మార్చుకున్న వ్యవసాయశాఖ, ఎపి సీడ్స్, ఆర్‌బికెల అధికారులు, ప్రైవేటు సప్లయర్స్ రింగై వేరుశనగ విత్తన సబ్సిడీని నొక్కేశారు. ఈ ఖరీఫ్‌లో రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధం చేసిన విత్తనాలను రైతులకు చేర్చకుండా కాగితాలపై పంపిణీ చేసినట్లు నమోదు చేసి కోట్ల రూపాయలు పంచుకున్నారు. వేరుశనగ అధికంగా సాగయ్యే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ కుంభకోణం జరిగినట్లు ఆరోపణలొస్తున్నాయి. ఇంకా ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల్లో కూడా అక్కడక్కడ ఇటువంటి అక్రమాలే చోటు చేసుకున్నట్లు సమాచారం. అక్రమాల వెనుక ప్రభుత్వంలోని కొందరు 'పెద్దల' పాత్ర కూడా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి.

మాస్టర్ ప్లాన్

2023-24 ఖరీఫ్‌లో దాదాపు 3 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 40 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. రెండు లక్షల క్వింటాళ్ల వరకు ఉమ్మడి అనంతపురానికి కేటాయించారు. టెండర్ల ద్వారా ప్రైవేటు సప్లయర్స్ నుంచి విత్తనాలను సేకరించాలనుకున్నారు. భౌతికంగా ఇండెంట్‌లో కొంత మేరకే సేకరించారు. ఆలస్యంగా మే 29న విత్తనాల పంపిణీని ఆర్‌బికెలలో ప్రారంభించారు. తొలినాళ్లలో అరకొరగా వచ్చిన విత్తనాలు నాలుగు రోజుల్లోనే అయిపోయాయి. అనంతరం నెమ్మదిగా ఆర్‌బికెలకు విత్తనాలు పంపారు. సీజన్ ఆరంభం నుంచీ వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, రైతులు వేరుశనగ సాగు పట్ల అనాసక్తిగా ఉండటాన్ని గమనించిన వ్యవసాయశాఖ, ఎపి సీడ్స్, ఆర్‌బికె అధికారులు, సప్లయర్స్ ప్రభుత్వ సబ్సిడీని కొట్టేయడానికి మాస్టర్ ప్లాన్ వేశారు. రైతులకు పంపిణీ చేసే నిమిత్తం సేకరించి గోదాముల్లో పెట్టిన విత్తనాలను కదిలించకుండా, ఆర్‌బికెలకు డెలివరీ చలాన్లు (డిసి) పంపి, అక్కడికి లోడు చేరినట్లు కాగితాలపై రాసి, ఆపై రైతులకు పంపిణీ చేసినట్లు పత్రాలు సృష్టించారు. ఆర్‌బికెలకు విత్తనాల లారీలు రాకుండానే వచ్చినట్లు రికార్డులు రూపొందించారు. ఎరువుల పంపిణీ, పిఎం కిసాన్ వంటి పథకాల నిమిత్తం రైతుల నుంచి సేకరించిన డిజిటల్ వేలిముద్రలను చాకచక్యంగా విత్తనాల పంపిణీకి ఉపయోగించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేయకుండా చేసినట్లు పత్రాలు తయారు చేశారు. వేరుశనగకు ఈ ఏడాది ప్రభుత్వం క్వింటాలుకు నిర్ణయించిన సబ్సిడీ రూ.3,720. అది పోను రైతు రూ.5,580 చెల్లించాలి. రైతు వాటా నాన్ సబ్సిడీ అమౌంట్‌ను మినహాయిస్తే క్వింటాలుకు రూ.3,720 సబ్సిడీ వస్తుంది. విత్తనాలు పంపిణీ చేయకుండానే సబ్సిడీ అమౌంట్‌ను పంచుకున్నారు. రైతుల తరపున సప్లయర్సే నాన్ సబ్సిడీ అమౌంట్ మిగతా 2లో



విజయవాడలో విఆర్ఎల సంఘం రాష్ట్ర నేతలు ఎం బాలకాశి తదితరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

విఆర్ఎల పై నిర్బంధం

- అయినా వేలాది మంది విజయవాడలో ప్రత్యక్షం
- వందలాది మంది అరెస్టు

2

ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసులు

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేస్తాం

- గ్రీస్‌లో మోడీ ఒక రోజు పర్యటన

ఎన్నికల ఫలితం తారుమారు కేసులో

ట్రంప్ లొంగుబాటు

- 20 నిమిషాలకే విడుదల
- దుమారం రేపిన మగ్‌షాట్ ఫొటో

లోపలి పేజీలో..



తుక్కులూరులో ఘర్షణకు దిగిన వైసిపి, టిడిపి శ్రేణులను చెదరగొడుతున్న పోలీసులు

మళ్లీ ఘర్షణ

- పరస్పరం రాళ్ల దాడి
- లోకేష్ పాదయాత్రలో ఉద్రిక్తత

ప్రజాశక్తి- నూజివీడు రూరల్, ముసునూరు (ఏలూరు జిల్లా)

ఏలూరు జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తొలిరోజు చేపట్టిన యువగళం పాదయాత్ర తీవ్ర ఉద్రిక్తతల నడుమ సాగింది. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం నుంచి ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం మీర్జాపురం గ్రామానికి యువగళం పాదయాత్ర గురువారం రాత్రి చేరుకుంది. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో జిల్లాలోని మీర్జాపురం నుంచి యాత్ర ప్రారంభమైంది. తుక్కులూరు సెంటర్ వద్ద వైసిపి నేత కొలుసు కాసులు ఇంటి వద్దకు వచ్చే సరికి కొంతమంది వైసిపి కార్యకర్తలు తమ పార్టీ జెండాలు ఊపుతూ సైకో జగన్ పాట ఆపాలంటూ నినాదాలు చేశారు. దీన్ని యువగళం మిగతా 2లో



వెంకటగిరి-ఎల్లకారు సమీపంలో నిలిచిన కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు

కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైల్లో పొగలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలులో శుక్రవారం పొగలు వచ్చాయి. వెంకటగిరి స్టేషన్ దాటిన తరువాత ఎసి బోగీ చక్రాల నుంచి పొగలు రావడాన్ని ప్రయాణికులు గుర్తించి భయాందోళనకు గురయ్యారు. వెంటనే చైన్ లాగి రైలును తిరుపతి జిల్లా వెంకటగిరి-ఎల్లకారు మధ్యలో నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు బ్రేకులు పట్టేయడం వల్లే పొగ వచ్చిందని నిర్ధారణకు వచ్చారు. మరమ్మతుల అనంతరం అరగంట తర్వాత రైలు యథావిధిగా బయలుదేరింది.

ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం

అక్టోబరులో చలో విజయవాడ

డివైఎఫ్ఐ జాతీయ సదస్సు



డివైఎఫ్ఐ జాతీయ సదస్సులో అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరులో మెగా డిఎస్‌సితో పాటు గ్రూపు -1, గ్రూపు-2 నోటిఫికేషన్లను విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జాతీయ సదస్సు డిమాండ్ చేసింది. లేని పక్షంలో అక్టోబరులో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించింది. విజయవాడ బందరు రోడ్డులోని ఎంబివికెలో శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పెరుగుతున్న "నిరుద్యోగం - పరిష్కార మార్గాలు" అనే అంశంపై డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వై.రాము అధ్యక్షతన జాతీయ సదస్సు జరిగింది. ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేయకుండా కాలక్షేపం చేస్తే యువత, నిరుద్యోగులు తాడో పేడో తేల్చుకునేందుకు సిద్ధంగా ఉండాలని సదస్సులో పాల్గొన్న వక్తలు పిలుపునిచ్చారు. సభలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ జయచంద్ర పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి 25వేల పోస్టులు పిఇటిలతో కలిపి నోటిఫికేషన్ విడుదల చేయాలని, గ్రూపు-1, గ్రూపు-2 ఐదు వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఎహెచ్ఎ, ఎఇ, ఎఇఇ, లైబ్రేరియన్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని సదస్సు డిమాండ్ చేసింది. వీటితో పాటు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత కోసం నియోజకవర్గ స్థాయిలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరింది, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలని, గ్రంథాలయాల్లో ఇ- లైబ్రరీ (డిజిటల్)ను ఏర్పాటు చేయడంతో పాటు సరిపడా సిబ్బందిని నియమించాలని కూడా సదస్సు తీర్మానించింది. వీటితో పాటు పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేసి మండల స్థాయి నుంచి శాశ్వత ప్రాతిపదికన కోచ్‌లను నియమించాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు (ఐవి) మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోతోందని, ఖాళీగా ఉన్న పోస్టులను కూడా ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. ఖాళీ ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయకుండా మరో పక్క ఉద్యోగుల పదవీ విరమణ వయసును ప్రభుత్వం పెంచుకుంటూ పోతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణ విధానాలను ప్రజలపై రుద్దుతున్నాయన్నారు. రాష్ట్రంలో 2.35లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తక్షణమే ఆయా పోస్టులను భర్తీ చేయాలని ఐవి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. "నిరుద్యోగ సమస్య అంతం- డివైఎఫ్ఐ పంతం" మిగతా 2లో

24 మందితో టిటిడి పాలకవర్గం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) 24 మంది సభ్యులతో నూతన పాలకమండలిని నియమిస్తూ సిఎం కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. టిటిడి ఛైర్మన్‌గా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని ఇప్పటికే ప్రభుత్వం నియమించింది. పాలకమండలి సభ్యులుగా ఎమ్మెల్యేలు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, సామినేని ఉదయభాను, ఎం తిప్పేస్వామిని నియమించింది. వీరితోపాటు సిద్దవటం యానాదయ్య, చందే అశ్వర్థనాయక్, మేకా శేషుబాబు, ఆర్ వెంకటసుబ్బారెడ్డి, గాదిరాజు వెంకట సుబ్బరాజు, పినాక శరత్ చంద్రారెడ్డి, రామ్‌రెడ్డి సాముల, బాలసుబ్రహ్మణియన్ పలనిస్వామి, ఎస్ఆర్ విశ్వనాథ్‌రెడ్డి, గడ్డం సీతారెడ్డి, కృష్ణమూర్తి వైద్యనాథన్, సిద్ధా వీర వెంకట సుధీర్‌కుమార్, సుదర్శన్ వేణు, నీరుసు నాగసత్యం, ఆర్‌వి దేశపాండే, అమోల్ కాలే, ఎస్ శంకర్, మిలింద్ కేశవ్ నర్వేకర్, కేతన్ దేశాయ్, బోర సౌరభ్‌ను సభ్యులుగా నియమితులయ్యారు.

అసలు విలువ కంటే భారీగా బాండ్లు జారీ

- పిల్‌ను విచారించిన హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో టిడిఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల జారీలో అక్రమాలు జరిగాయని హైకోర్టులో పిల్ దాఖలైంది. తాడేపల్లిగూడెం టిడిపి ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు వేసిన పిల్‌ను చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎవి శేషసాయితో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరిపింది. తాడేపల్లిగూడెంలోని కోడేరు-నల్లజర్ల రహదారి విస్తరణ నిమిత్తం రూ.18 కోట్ల విలువ చేసే మూడు వేల చదరపు మీటర్ల స్థలాన్ని అధికారులు సేకరించారని, అయితే ఆ విలువ కంటే నాలుగు రెట్లు అధికంగా టిడిఆర్ బాండ్లు జారీ చేశారని పిటిషనరు తరపున న్యాయవాది వాదించారు. ఇంతచేసిన తర్వాత స్థలాలను కూడా స్వాధీనం చేసుకోలేదన్నారు. లబ్ధిదారుల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ కూడా ఉన్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో హైకోర్టుకు రావాల్సి వచ్చిందని వివరించారు. అక్రమాలకు పాల్పడిన అధికారులను తక్షణమే సస్పెండ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, డిటిసిపి డైరెక్టరు, జిల్లా కలెక్టరు, స్థల యజమాని కొట్టు సత్యనారాయణ (దేవాదాయశాఖ మంత్రి), హేమంత్ కుమార్, తిరుమలబాబు ఇతరులకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలంది. విచారణను అక్టోబరుకు వాయిదా వేసింది.

చాణిక్యరాజుపై చర్యలకు హైకోర్టు అనుమతి

అటవీ ప్రాంత పరిధి నుంచి రంపపు కోత మిషన్ల తరలింపు వ్యవహారంలో నిబంధనలు పాటించని కర్నూలు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా చేసిన చాణిక్యరాజుపై ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు హైకోర్టు అనుమతిచ్చింది.

చాణిక్యరాజుకు ఊరటనిస్తూ ఎపి పరిపాలన ట్రిబ్యునల్ (ఎపిఎటి) 2017లో జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తూ జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ కె మన్మథరావుతో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు చెప్పింది. కర్నూలు జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారిగా చాణిక్యరాజు పనిచేసేప్పుడు 4 రంపపు కోత మిషన్ల తరలింపు విషయంలో నిబంధనలను అమలు చేయలేదని ఉన్నతాధికారులు 2013లో చార్జిమెమో ఇచ్చారు. వాదనలు తెలియజేయాలని 2016లో నోటీసు కూడా ఇచ్చారు. వాటిని చాణిక్యరాజు ఎపిఎటిలో సవాల్ చేశారు. మెమో, నోటీసులను ఎపిఎటి రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. దీనిని సవాల్ చేస్తూ అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి 2017లో హైకోర్టును ఆశ్రయించారు.

వేరుశనగ సబ్సిడీ పక్కదారి!

(మొదటి పేజీ తరువాయి)

కట్టారు. ఉమ్మడి అనంతపురంలో పంపిణీ చేశామంటున్న రెండు లక్షల క్వింటాళ్లలో సుమారు 20 శాతం (40 వేల క్వింటాళ్లు) వరకు ఈ విధంగానే చేతులు మారాయని ఆరోపణలొస్తున్నాయి. రూ.10-15 కోట్ల వరకు కొట్టేశారని సమాచారం.

వాటాలేసుకున్నారు..

ఒక లారీలో 90 క్వింటాళ్ల వరకు రవాణా అవుతాయి. లారీకి సర్కారు ఇచ్చే సబ్సిడీ దాదాపు రూ.మూడున్నర లక్షలు. రూ.లక్షన్నర వరకు వ్యవసాయశాఖకు ముట్టాయి. ఆపైన రెండున్నర లక్షలూ సప్లయర్స్, ఇతరుల జేబుల్లోకి చేరాయని చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గుత్తి, గుంతకల్, పామిడి, వజ్రకరూర్, ఉరవకొండ, విడపనకల్లు, కళ్యాణదుర్గం, కదిరి తదితర మండలాల్లో అక్రమాలు అధికంగా జరిగాయని ఆరోపణలొస్తున్నాయి. కదిరి మండలంలో ఒక కిందిస్థాయి అధికారి ఏకంగా 12 లారీల విత్తనాలు దారిమళ్లించినట్లు వ్యవసాయశాఖలోని వారే ఫిర్యాదులు చేసుకున్నట్లు తెలిసింది. ఇటువంటి ఉదంతాలు చాలానే సంభవించాయని చెబుతున్నారు.

విఆర్‌ఎలపై నిర్బంధం

- అయినా వేలాది మంది విజయవాడలో ప్రత్యక్షం
- వందలాది మంది అరెస్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం విఆర్‌ఎలు (గ్రామ రెవెన్యూ సహాయకులు) తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్బంధానికి పాల్పడింది. విజయవాడకు రానీయకుండా అడ్డుకోవాలని లక్ష్యంతో ఎక్కడికక్కడ అరెస్ట్‌లను చేసింది. అయినా, వేలాదిమంది విఆర్‌ఎలు విజయవాడకు చేరుకున్నారు. ధర్నా చౌక్‌లో తమ సమస్యల పరిష్కారం కోసం నినదించారు. దీంతో విజయవాడలో కూడా పోలీసులు అరెస్ట్‌లకు దిగారు. వందలాదిమంది విఆర్‌ఎలను పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. గ్రామ రెవెన్యూ సహాయకులకు (విఆర్‌ఎ) పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలి, పదోన్నతులలో పాత విధానాన్ని అమలు చేయాలని, రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలన్న డిమాండ్లతో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కమిటీ చేపట్టిన చలో విజయవాడకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. నిర్బంధాన్ని అధిగమించి విజయవాడలోని అలంకార్ సెంటర్‌కు చేరుకున్న విఆర్‌ఎలు పెద్దయెత్తున నిరసన చేపట్టారు. దీంతో పోలీసులు గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద్దన్న, రాష్ట్ర కార్యదర్శి ఎం బాలకాశి, రాష్ట్ర నాయకులు టి రామాంజనేయులు, రవి బందగి, సురేష్, యాకోబ్, రహిమాన్, బాజీ తదితరులతోపాటు పెద్దసంఖ్యలో విఆర్‌ఎలను అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులకు విఆర్‌ఎలకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఎం బాలకాశి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 22,000 గ్రామ రెవెన్యూ సహాయకులకు అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా విస్మరించారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కొత్తగా వేతనం పెంచకపోగా గత ప్రభుత్వం ఇచ్చిన రూ.300 డిఎను రద్దు చేశారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల అమలు కోసం అధికారులు, మంత్రుల చుట్టూ తిరిగినా ఏ మాత్రం స్పందించడం లేదని అన్నారు. కేవలం రూ.10,500 వేతనంతో విఆర్‌ఎలు కుటుంబాలతో ఎలా బతకాలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం విఆర్‌ఎలను రెగ్యులర్ ఉద్యోగాలుగా మారుస్తూ నిర్ణయం తీసుకోగా, మన ప్రభుత్వం కనీసం వేతనాలను కూడా పెంచేందుకు ఇష్టపడటం లేదని విమర్శించారు. శాంతియుత నిరసనలపై పోలీసుల నిర్బంధానికి నిరసనగా అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇదే మొండివైఖరిని కొనసాగిస్తే సిఎం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



అరెస్టయిన విఆర్‌ఎలను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

విఆర్‌ఎల అక్రమ అరెస్టులను ఖండించిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

శాంతియుతంగా ధర్నా చేయడానికి విజయవాడ వచ్చిన విఆర్‌ఎలను అక్రమంగా అరెస్టు చేయటం తగదనిఅన్నారు. పోలీస్ స్టేషన్‌లలో వున్న విఆర్‌ఎలను ఆయన పరామర్శించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని విఆర్‌ఎల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్ పురస్కారాలకు 31 వరకు దరకాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



2023కు గానూ వైఎస్ఆర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్ఆర్ అచీవ్‌మెంట్ పురస్కారాల కోసం ఈ నెల 31 వరకు దరకాస్తులను స్వీకరించనున్నట్లు ఐఅండ్‌పిఆర్ కమిషనరు, వైఎస్ఆర్ అవార్డుల హైపవర్ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అత్యున్నత పురస్కారాల తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ అవార్డులను అందజేస్తోందన్నారు. దరకాస్తు చేసుకునే వ్యక్తులు, సంస్థలు తమ విజయాలు, సేవల గురించి ఒక పేజీకి మించకుండా సమాచారాన్ని అందించాలని, వారి ఫోన్ నెంబరు, ఇ-మెయిల్, ఐడి వంటి వివరాలు పొందుపరచాలని ఆయన పేర్కొన్నారు. నామినేషన్స్‌పై ఎలాంటి పరిమితి లేదని, ఆయా రంగాల్లో ఎలాంటి ఎంట్రీలైనా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వ్యక్తులు, సంస్థలు తమ నామినేషన్లను secy-political@ap.gov.in మెయిల్ ఐడికి కూడా పంపొచ్చని పేర్కొన్నారు. ప్రజా సేవలో విశిష్ట సేవలు అలందించిన వ్యక్తులు, వేర్వేరు అంశాల్లో ప్రతిభ కనబరిచిన వారి దరకాస్తులను పంపించేలా శాఖాధిపతులు, కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తులు పంపుకునేందుకు కళలు, సామాజిక సేవ, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీస్, స్పోర్ట్స్, రంగాలతోపాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వ్యక్తులు, గ్రామాలు, మురికివాడల్లో పనిచేస్తున్న వారు, రాష్ట్రానికి చెందిన వ్యక్తులు, పొలిటికల్ ఎన్‌జిఒలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, చరిత్రలో పేరుగాంచిన సంస్థలు, సంఘాలు దరఖాస్తులు పంపుకోవడానికి అర్హులని కమిషనరు విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

రూ.40 వేలకోట్ల ఇసుక దోపిడీ

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రూ.40 వేలకోట్లు విలువ జేసే 40 కోట్ల టన్నుల ఇసుక అక్రమ తవ్వకాలు జరిగాయని, ఇసుక దోపిడీపై 48 గంటల్లో సిఎం సమాధానం చెప్పాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. మంగళగిరిలోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఇసుక దోపిడీపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక దోపిడీపై విచారణ చేస్తామని, తప్పు చేసిన అధికారులను శిక్షిస్తామని అన్నారు. ఇసుక ద్వారా అనేక రంగాలు లబ్ధి పొందుతాయని, సహజ సంపద ప్రజలకు చెందాలే కానీ, ఇతరులకు దోపిడీ వనరుగా మారడానికి వీల్లేదని అన్నారు. ఇసుక 40 లక్షల మంది నిర్మాణ రంగ కార్మికులకు జీవనోపాధి కల్పిస్తుందని, 125 ఇతర కులవృత్తుల జీవనోపాధికి ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. జగన్ ప్రభుత్వ నిర్ణయాలతో 40 లక్షల నిర్మాణరంగ కార్మికుల కుటుంబాలు రోడ్డునపడ్డాయని చంద్రబాబు విమర్శించారు. కుటుంబ పోషణ కష్టమై 130 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇసుక మాఫియా నిర్వాకంతో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయిందని, ఆ దుర్ఘటనలో 48 మంది మరణించారని తెలిపారు. తొలుత ఎపిఎండిసి ద్వారా ఇసుక అమ్మకాలు సాగిస్తామని ప్రకటించి, అనంతరం మాట మార్చి జెపి పవర్ వెంచర్స్ (జెపి) అనే బినామీ సంస్థతో 3.5.2021న ఒప్పందం చేసుకుని ఇసుక రీచ్‌లను అప్పజెప్పారన్నారు. ఆ సంస్థ ఎన్‌సిఎల్‌టిలో ఉందని దివాళా తీసిందని, ఆ సంస్థకు గతంలో ఇసుక తవ్వకాలు, రీచ్‌ల నిర్వహణలో ఎలాంటి అనుభవం లేదని పేర్కొన్నారు. ఇసుక రీచ్‌లను జెపి పవర్ వెంచర్స్‌కు, ఇసుక తవ్వకం, అమ్మకం, రవాణా వ్యవహారాలు టర్న్ సంస్థకు సబ్ కాంట్రాక్టు ఇచ్చిందన్నారు. ఆయా సంస్థల మధ్య వాటాలు తేడాలు రావడంతో 2022లో టర్న్ సంస్థ తప్పుకుందని చంద్రబాబు పేర్కొన్నారు. 2022 ఆగస్టు నుంచి వైసిపి నేతలు జిల్లాల వారీ టార్గెట్లు పెట్టుకుని ఇసుక దందాలో మునిగి తేలుతున్నారన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను బేఖాతరు చేసి పర్యావరణానికి ముప్పు వాటిల్లేలా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఓట్ల తొలగింపులో అక్రమాలపై ఈ నెల 28న కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి విచారణ కోరనున్నట్లు చంద్రబాబు తెలిపారు.

బిజెపి ఓటమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. సమాఖ్య విధానం, లౌకికవాదం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, న్యాయశాఖ స్వతంత్రను మార్చరాదని తెలిపారు. వీటిని మార్చి తమకు అనుకూలంగా రాజ్యాంగాన్ని రూపొందించడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దేశంలో హిందూ ఆధిపత్య ధోరణులను పెంచేందుకు బిజెపి కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. పౌరసత్వం మతం ఆధారంగా ఇస్తామనడం సరికాదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మాట్లాడుతూ మోడీ డైరక్షన్‌లోనే జగన్ ప్రజలపై భారం మోపుతున్నారని, విద్యుత్ ఛార్జీల పెంపు, చెత్తపన్ను, ఆస్తి పన్ను పెంపు కూడా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జరుగుతున్నాయని అన్నారు. జగన్ నవరత్నాలు ఇచ్చి ప్రజలపై నవ భారాలు మోపుతున్నారని విమర్శించారు. మోడీ, జగన్ కలసి రాజధానిలేని రాష్ట్రంగా ఎపిని మార్చారని అన్నారు. ఈ సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అధ్యక్షత వహించారు.



సదస్సులో మాట్లాడుతున్న బివి రాఘవులు

నైపుణ్యాభివృద్ధి వేదికలుగా విజ్ఞాన కేంద్రాలు
తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ప్రారంభంలో బివి రాఘవులు

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బహుముఖ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువత, మహిళల్లో నైపుణ్యాల అభివృద్ధికి, సృజనాత్మకత పెంపొందించటానికి విజ్ఞాన కేంద్రాలు దోహదపడాలని హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఛైర్మన్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రాన్ని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, విజ్ఞాన్స్ అధినేత డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన కేంద్రాల రాష్ట్ర కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు తదితరులతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో రాఘవులు మాట్లాడుతూ జాతీయోద్యమ కాలంలో విద్యాభివృద్ధికి, చదువుపై ఆసక్తి పెంచడానికి కమ్యూనిస్టులు ఎంతో కృషి చేశారన్నారు. సుందరయ్య మరణానంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సుందరయ్య విజ్ఞాన కేంద్రం స్ఫూర్తితో ఇప్పుడు రాష్ట్రంలో పలుచోట్ల విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో మేధావుల శక్తి సామర్థ్యాలను వినియోగించుకోలేకపోవడం వల్లనే విదేశాలకు వెళ్లిపోతున్నారన్నారు. వారిశక్తిని వినియోగించుకునేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. చైనా, అమెరికా వంటి దేశాల స్థాయికి దేశం ఎదగాలంటే అక్కడి మాదిరిగా శ్రమశక్తిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏటా సుమారు మూడు లక్షల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుంటున్నారని, వారిలో అతి కొద్దిమందికే ఉద్యోగావకాశాలు దక్కుతున్నాయని తెలిపారు. నైపుణ్యాలు లేకపోవడమే అందుకు కారణమన్నారు. విజ్ఞాన కేంద్రాలు విద్యార్థులు, యువతలో నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ డి.రమేష్, పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు తేళ్ల వినోద తదితరులు పాల్గొన్నారు.

రూ.300 కోట్ల ఇఎస్ఐ కుంభకోణం కేసులో ఛార్జిషీటు దాఖలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బీమా వైద్య సేవల (ఇఎస్ఐ) కుంభకోణంలో రూ.300కోట్ల అవినీతి జరిగిందని దర్యాప్తు అధికారులు నిగ్గుతేల్చారు. ఎసిబి నమోదుచేసిన కేసు ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరో కేసు నమోదు చేసి సమగ్రంగా దర్యాప్తు చేసింది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలతో ఇడి అధికారులు శుక్రవారం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఇఎస్ఐ మాజీ డైరెక్టర్ దేవికారాణిని ఈ కుంభకోణంలో ప్రధాన నిందితురాలిగా ఇడి పేర్కొంది. ఆమెతో పాటు మరో 15 మందిని ఇడి నిందితులుగా చేర్చింది.

గతంలో నిందితులకు చెందిన రూ.144 కోట్ల ఆస్తులను ఇడి జప్తు చేసింది. వైద్యం చేయకుండానే చేసినట్లు, మందులు కొనకుండానే కొన్నట్లు చూపడంతో పాటు తక్కువ ధరకు కొనుగోలు చేసి లెక్కల్లో ఎక్కువ చూపడం ద్వారా కొందరు ఇఎస్ఐ అధికారులు భారీ కుంభకోణానికి పాల్పడినట్లు 2019లో ఎసిబి కేసు నమోదు చేసింది. అనంతరం కేసును ఇడికి బదిలీచేశారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు ఎన్.రామారావు, యు.రామస్వామి అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 925వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు విషయంలో మొండి వైఖరి అవలంబిస్తోందని అన్నారు. సుదీర్ఘ కాలంగా కార్మికులు, ప్రజలు ఉక్కు కర్మాగారం రక్షణకు పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నూటికి నూరు శాతం అమ్మేందుకు సిద్ధపడటం దారుణమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయివేటుపరం కానివ్వబోమని స్పష్టం చేశారు. ప్లాంట్ ప్రజల సంపదని, కాపాడుకోవడం అందని బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.సంపూర్ణం, గుమ్మడి నరేంద్ర, డి.దేముడు, జి.ఆనంద్, ఎంకెవి.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో భార్యాభర్తలు ఆత్మహత్య

- కుమార్తె పరిస్థితి విషమం

ప్రజాశక్తి - పెందుర్తి (విశాఖపట్నం)



సత్యనారాయణ, సూర్యకుమారి (ఫైల్)

విశాఖ జిల్లా పెందుర్తి మండలం గొరపల్లిలో దారుణం చోటు చేసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనలో భార్యాభర్తలు మృతిచెందగా, కుమార్తె పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గొరపల్లి గ్రామానికి చెందిన కల్లూరి సత్యనారాయణ (51), సూర్యకుమారి (45) భార్యాభర్తలు. వీరికి కుమారుడు సంతోష్, కుమార్తె నీలిమ ఉన్నారు. కిరాణా దుకాణం నడుపుకుంటూ వీరి కుటుంబం జీవించేది. కోవిడ్ కాలం నుంచి ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. వ్యాపారం, కుమారుడు చదువు కోసం సత్యనారాయణ అందినకాడికి అప్పులు చేశారు. వాటిని తీర్చేమార్గంలేక గురువారం రాత్రి 11 గంటల సమయంలో సత్యనారాయణ, సూర్యకుమారి, నీలిమ పురుగుల మందు తాగారు. కుమారుడు సంతోష్ వారి పరిస్థితిని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో వారిని కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సత్యనారాయణ, మధ్యాహ్నం సూర్యకుమారి మృతిచెందారు. నీలిమ పరిస్థితి విషమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు రూ.20 వేలకు పెంచాలి : కె ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు తక్షణమే జీతాలను రూ.20 వేలకు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిసెంట్ల యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఎఎన్‌వి మహేష్ అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్ల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023-24 బడ్జెట్ కేటాయింపుల్లో ఉపాధి హామీ పథకానికి పెద్ద ఎత్తున నిధులు కోత పెట్టిందన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి నరసింహులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జీతాలు పెంచుతామని ఊరిస్తుందే తప్ప సమస్య పరిష్కరించడం లేదన్నారు. ఈ సమావేశంలో జిల్లాల నాయకులు ఖాదర్ బాషా, హరి ప్రసాద్, విశ్వనాథ్, కోటయ్య, భవాని, వెంకటేశ్వర్లు, శివ సూర్యనారాయణ, రాజు నాయక్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఉద్యోగాల నోటిపికేషన్ల కోసం అక్టోబరులో చలో విజయవాడ

(మొదటి పేజీ తరువాయి)

అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్త ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డిఎస్‌సి, పోలీస్ కానిస్టేబుల్, ఆర్‌ఆర్‌బి, యుపిఎస్‌సి, బ్యాంకింగ్, రైల్వే ఉద్యోగాలకు తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటిఫికేషన్లు విడుదల చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సదస్సులో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేంద్రగౌడ్, ఎహెచ్‌ఎ రాష్ట్ర నాయకులు శ్రీను, నిరుద్యోగ ఐక్య వేదిక నాయకులు ప్రకాష్, పవన్, బుజ్జి పాల్గొన్నారు.

మళ్లీ ఘర్షణ

(మొదటి పేజీ తరువాయి)

వలంటీర్లు ప్రతిఘటించారు. ఈ సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకుని యువగళం టీమ్ సభ్యులను నిలువరిస్తూ, వైసిపి శ్రేణులను అక్కడి నుంచి పంపించేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ ఘర్షణలో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. వైసిపి నేతలపై టిడిపి నేత, మాజీ మంత్రి కొత్తపల్లి జవహర్ కుమారుడు ఆశిష్, మరో నేత వెంకటప్ప పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి రశీదును పోలీసులు ఇవ్వకపోవడంతో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. పోలీసులు ఫిర్యాదు అందినట్లు రశీదు ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. టిడిపి నేతల ఫిర్యాదులో కొందరు వైసిపి నేతల పేర్లు ప్రస్తావిస్తూ వారు ఉద్దేశపూర్వకంగా బీరు సీసాలు, రాళ్లతో పాదయాత్రలోకి చొరబడి దాడి చేశారని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో వైసిపి నేతలు కవ్వింపు చర్యలకు దిగే అవకాశం ఉందని ముందస్తుగా పోలీసులకు చెప్పినప్పటికీ వారిని పోలీసులు అడ్డుకోలేదని టిడిపి నేతలు విమర్శించారు.

అధికారంలోకి రాగానే మామిడి బోర్డు ఏర్పాటు
పామాయిల్‌కు గిట్టుబాటు ధర
జగన్‌కు బటన్ నొక్కడం తప్ప ఏమీ తెలియదు : లోకేష్

తాము అధికారంలోకి రాగానే మామిడి బోర్డు ఏర్పాటు చేస్తామని, పామాయిల్‌కు గిట్టుబాటు ధర కల్పిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర గొల్లపల్లి, మోర్సపూడి మీదుగా తక్కులూరు చేరుకుంది. మార్గమధ్యంలో మహిళలతో మాట్లాడుతూ విద్యార్థులతో సెల్ఫీ దిగుతూ లోకేష్ వడివడిగా సాగింది. తక్కులూరు వద్ద భోజన విరామానికి ఆగారు. అనంతరం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నూజివీడు శివార్లలోని మార్కెట్ యార్డు సమీపంలో మామిడి, పామాయిల్ రైతులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మిర్చి, పొగాకు పంటల మాదిరిగా మామిడి పంటకు కూడా బోర్డు పెట్టాలని కోరారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ, తాము అధికారంలోకి రాగానే మామిడి బోర్డు పెడతామని, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అక్కడి మామిడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలు మన రాష్ట్రంలోని మామిడి రైతులకు అందిస్తామని హామీ ఇచ్చారు. జగన్‌కు రైతుల సమస్యలపై అవగాహన లేదని, బటన్ నొక్కడం తప్ప ఆయనకు ఇంకేమీ తెలియదని లోకేష్ విమర్శించారు. అనంతరం పాదయాత్ర నూజివీడు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల మీదుగా సాగి నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లె చేరుకుంది.

ఆంధ్రుల ఆత్మగౌరవం ఏమైంది?

- టిడిపి, వైసిపిలు బిజెపికి మద్దతు తెలపడం దారుణం
- రాష్ట్రంలో అధ్వాన రాజకీయాలు : బి.వి.రాఘవులు

ప్రజాశక్తి-పెదనందిపాడు/ గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు ఢిల్లీలో బిజెపికి తాకట్టు పెట్టాయని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శించారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో తేళ్ల ఆదినారాయణ విజ్ఞాన కేంద్రం వద్ద, గుంటూరులో శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మణిపూర్ ఘటనలపై ప్రతిపక్షాలు పార్లమెంట్‌లో అవిశ్వాసం ప్రవేశపెడితే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపికి మద్దతు పలకడం దారుణమని అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవంతో పుట్టిన పార్టీలు ఇలాచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి పౌరస్మృతి చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. సినిమాల్లో రాణించలేని వారు రాజకీయాల్లోకి వస్తుంటారని, రాజకీయాల్లో రాణించలేక తిరిగి సినిమాల్లోకి వెళ్లిన వారూ ఉన్నారని తెలిపారు. సినిమా ఒక వ్యాపారం, రాజకీయాన్ని కూడా కొంత మంది వ్యాపారంగా భావిస్తున్నారని అన్నారు. బిజెపిపై దేశ వ్యాప్తంగా పోరాటం చేస్తామని హడావుడి చేసిన కెసిఆర్ ఇప్పుడు తన వైఖరి ఎందుకు మార్చుకున్నారో ఆయనే చెప్పాలన్నారు. రాష్ట్రంలో టిడిపితో సిపిఐ కలిసి వెళ్తుందని తాము అనుకోవడంలేదని, బిజెపితో కలిసి పనిచేసే పార్టీలతో వామపక్షాలు కలిసే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో రాజకీయాలు విచిత్రంగా, అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. తాను దేశంలో చాలా రాష్ట్రాలు పర్యటిస్తున్నానని, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నంత విచిత్రంగా రాజకీయాలు ఎక్కడా లేవన్నారు. ఇక్కడి ప్రధాన పార్టీలు అమరావతిలో కత్తులు దూసుకుంటూ.. ఢిల్లీలో కౌగిలించుకుంటున్నాయని అన్నారు. రాష్ట్రాన్ని టిడిపి ఐదేళ్లు పాలించి, రాజధాని అమరావతిలో నిర్మాణాలు పూర్తి చేయలేదని తెలిపారు. ఐదేళ్లలో శాసన సభ, సిఎం, గవర్నర్ నివాసం నిర్మించి ఉంటే ఇప్పుడు మూడు రాజధానుల పంచాయితీ ఉండేది కాదన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని అంటే కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొత్త రాజధాని ఏర్పాటు చేస్తే జేబులు నింపుకోవచ్చన్న ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల అంశం తెరపైకి తెచ్చారన్నారు. ఇప్పుడు విశాఖపట్నాన్ని కబ్జాల కేంద్రంగా మార్చారని విమర్శించారు. ప్రజలు రాజకీయాలు, అభివృద్ధి గురించి ఆలోచించకుండా ఉండేందుకు కులం పేరుతో విభజన సృష్టించారన్నారు. ప్రత్యామ్నాయ శక్తులు ఆధికారానికి రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ మొన్నటి వరకు చేగువేరా బొమ్మ పెట్టుకున్నారని, ఇప్పుడు మోడీ బొమ్మ తగిలించుకుంటున్నారని తెలిపారు. మోడీ బొమ్మతో రాష్ట్రానికి ఒరిగిందేమిలేదని విమర్శించారు. గుంటూరు ఛానల్‌ను పొడిగించాలని దశాబ్దాల కాలం నుండి అడుగుతున్నా పట్టించుకోవడంలేదని, కేవలం రూ.300 కోట్లు కేటాయిస్తే సుమారు 60 వేల ఎకరాలకు సాగునీరు, 60 గ్రామాల ప్రజలకు తాగునీరు అందుతుందని తెలిపారు. పెద్ద పెద్ద ప్రాజెక్టుల్లో కమీషన్లు మిగులుతాయని, వాటికే నిధులు ఇస్తున్నారని, ఇలాంటి చిన్న చిన్న ప్రాజెక్టులు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భూసేకరణకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం నిధులు కూడా ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు ఛానల్, అలాగే పల్నాడులో వరికెపూడిశెలకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఎసిబి వలలో వ్యవసాయ అధికారి

ప్రజాశక్తి-అనంతపురం

ఎరువుల దుకాణం రెన్యువల్‌కు రూ.15 వేలు లంచం తీసుకుంటూ వ్యవసాయ అధికారి, జూనియర్ అసిస్టెంట్ ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా కూడేరు మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూడేరు మండలంలోని మరుట్ల గ్రామంలో బండారు వెంకటేశ్ అనే వ్యక్తి తన గ్రామంలో ఎరువులు, పురుగుల మందుల విక్రయ కేంద్రం ఏర్పాటుకు అనుమతుల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. అనుమతులు ఇవ్వాలంటే రూ.15 వేలు లంచం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరప్రసాద్ తన కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ గిరిబాబు ద్వారా డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు వెంకటేశ్ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఎసిబి అధికారుల సూచనల మేరకు రూ.15 వేలు లంచం ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితులు వెంకటేశ్వర ప్రసాద్, గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి వెంకటాద్రి తెలిపారు. వీరిద్దరినీ కర్నూలులోని ఎసిబి కోర్టులో శనివారం హాజరుపరచనున్నట్లు చెప్పారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే వుండాలని, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో వందశాతం సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వందశాతం ఎన్‌రోల్‌మెంట్ సాధించాలంటే సెప్టెంబరు 2005 నుంచి ఆగస్టు 2018 మధ్య జన్మించిన పిల్లలందరూ పాఠశాలల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు గ్రామ వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, జూనియర్ కాలేజ్ లెక్చరర్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్, జిల్లా అధికారుల సహకారం తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను సెప్టెంబరు 4 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం వద్ద డేటా నుంచి ఏ ఒక్క విద్యార్థి డేటా తప్పయినా, ఏ ఒక్కరూ నమోదు కాకుండా బయట వుండరాదన్నారు. డేటా అంతా స్వచ్ఛమైనదిగా ఉండాలని, ఎక్కడా పొరపాట్లకు తావివ్వకుండా చేయాలని సూచించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా వందశాతం విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ వున్న ప్రభుత్వంగా రాష్ట్ర ప్రభుత్వం వుండాలని ఆకాంక్షించారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

అభివృద్ధి పేరుతో రైతుల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలవంతంగా లక్షల ఎకరాల భూములను స్వాధీనం చేసుకొని వ్యవసాయన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. నెల్లూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సాగరమాల, భారత్‌మాల పేర్లతో వేల ఎకరాల భూములను రైతుల నుంచి బలవంతంగా గుంజుకుంటున్నారన్నారు. ఎస్ఇజెడ్ ఏర్పాటు, పైపు లైన్ల నిర్మాణం, విద్యుత్ పంప్డ్ స్టోరేజ్, విండ్, సోలార్ పేరుతో కొన్ని వేల ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. గ్రామ సభలు, సమావేశాలు, రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించకుండా ఒక్క అనంతపురం, కర్నూలు జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా రైతుల నుంచి భూములను


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు, పక్కన మూలం రమేష్, ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని చెప్పారు. రైతుల నుంచి బలవంతంగా స్వాధీనం చేసుకొన్న భూములను అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. దీనివల్ల వ్యవసాయ రంగం కుదేలైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతంలోని వ్యవసాయ కూలీలుగా పింఛను ఇవ్వాలని కోరారు. అభివృద్ధి అంటే ప్రజలు భాగస్వామ్యంగా ఉండాలన్నారు. ఎవరు భూములను కోల్పోతున్నారో వారు ఆత్మహత్యలకు పాల్పడే విధంగా వ్యవహరిస్తూ తాము రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని ప్రకటించుకుంటే సరిపోతుందా? అని ప్రశ్నించారు. పరిశ్రమలు స్థాపించకుండా, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా ఇన్ని వేల ఎకరాల భూములను ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దాదాపు 26 వేల ఎకరాల్లో ఏర్పాటు చేసిన వాన్‌పిక్, సత్యసాయి జిల్లాలో ఎనిమిది వేల 500 ఎకరాల్లో నాలెడ్జ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు భూములు తీసుకుంటే ప్రస్తుతం అక్కడ ఏమి లేవన్నారు. పరిశ్రమలు స్థాపించని పక్షంలో భూములను తిరిగి రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ.. సాగరమాల పేరుతో కృష్ణపట్నం పోర్టుకు రహదారులు నిర్మించే క్రమంలో అనేక మంది రైతులు భూములు కోల్పోయారని తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతెనను పరిశీలిస్తున్న సురేంద్ర

ఎన్నికల సమయంలోనే సమస్యలు గుర్తొస్తాయా?

- ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - కొమరాడ (విజయనగరం)

ఎన్నికల సమయంలోనే సమస్యలు గుర్తొస్తాయి తప్ప ఆ తర్వాత పరిష్కరించేందుకు కూడా కనీసం ప్రజాప్రతినిధులు చొరవ చూపకపోవడం దారుణమని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా కొమరాడ మండలంలోని కోమట్లపేట, పూర్ణపాడు వంతెనను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ వంతెన నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన తొమ్మిదవ రోజు రిలే నిరాహార దీక్షకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం పూర్ణపాడు-లాబేసు వంతెన పెండింగ్ పనులను పరిశీలించారు. నిరాహారదీక్షా శిబిరం వద్ద విలేకరులతో సురేంద్ర మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన విజయనగరం పర్యటనలో పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వంతెన నిర్మాణానికి మంజూరైన రూ.14 కోట్ల నిధులు దుర్వినియోగంపై విచారణ జరపాలని, నిధుల అవకతవకలపై మంత్రి, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి తొమ్మిది పంచాయతీల్లో 60 ఆదివాసీ గిరిజన గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించాలని కోరారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అవినాష్, వంతెన నిర్మాణ సాధన కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, బత్తిలి శ్రీనివాసరావు, పాలక నూకరాజు, ఎ.ఉపేంద్ర, శివున్నాయుడు, శంకర్రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

శంకుస్థాపనలు కాదు.. నిధులు కేటాయించండి

- ప్రజా సమస్యలపై 30 నుంచి సమర భేరి : సిపిఎం


ప్రజాశక్తి - విజయనగరం టౌన్

గిరిజనులకు ఉన్నత విద్యను అందించేందుకు విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న గిరిజన యూనివర్సిటీకి చేయాల్సింది శంకుస్థాపనలు కాదని, నిధులు కేటాయించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం ప్రకటించిన గిరిజన యూనివర్సిటీ పదేళ్లయినా ఇంకా శంకుస్థాపన దశలోనే ఉండడమంటే గిరిజనుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతోందని తెలిపారు. వర్సిటీకి నిధులు రప్పించడంలో, నిర్మాణం చేపట్టడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో శుక్రవారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్య ఉద్యమాలు ఫలితంగా గతంలో చంద్రబాబునాయుడు కొత్తవలస మండలం రెల్లివద్ద స్థలం కేటాయించి శంకుస్థాపన చేశారని, ప్రహరీ కూడా నిర్మించారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వర్సిటీని గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కాలయాపన చేశారన్నారు. ఈ పదేళ్లలో వర్సిటీ నిర్మాణం కోసం నిధుల గురించి కేంద్రాన్ని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. తక్షణం నిధులు మంజూరు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు

30 నుంచి సమరభేరి

ప్రజా సమస్యలను పరిష్కరించాలని, భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ వరకు రాష్ట్ర వ్యాప్తంగా సమరభేరి నిర్వహిస్తున్నట్లు వెంకటేశ్వరరావు, లోకనాథం తెలిపారు. విద్యుత్ భారాలు ఉపసంహరించాలని కోరుతూ ఈ నెల 28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహిస్తామన్నారు. విజయనగరం జిల్లాలో ఇప్పటికే ఉన్న జ్యూట్ మిల్లులు మూతపడి వేలాది మంది రోడ్డున పడ్డారని అన్నారు. కొత్త పరిశ్రమలు రాకపోగా ప్రభుత్వం పెంచిన విద్యుత్ ధరల వల్ల జిల్లాలోని పెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు, ప్రజలు తీవ్ర భారాలు మోయాల్సి వస్తుందన్నారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలు, ట్రు అప్‌ఛార్జీలు, సర్ ఛార్జీల పేరిట వేస్తున్న భారాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పాల్గొన్నారు.



హిందూపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

కుప్పంలోనూ గెలవబోతున్నాం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - హిందూపురం, మడకశిర (శ్రీ సత్యసాయి జిల్లా)

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో కూడా వైసిపి గెలవబోతోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో నేతలందరూ సమిష్టిగా కృషి చేస్తే విజయం తథ్యమని స్పష్టం చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో వైసిపి కార్యాలయాన్ని మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ప్రాతినిత్యం వహిస్తున్న కుప్పంలో సైతం గెలవబోతున్నామన్నారు. హిందూపురం నియోజకవర్గంలో వైసిపికి పెద్ద ఎత్తున ఓటు బ్యాంకు ఉందన్నారు. నేతలందరూ ఐకమత్యంతో పని చేస్తే ఇక్కడ సులభంగా విజయం సాధిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల హిందూపురం రూరల్ మండలం చలివెందుల పంచాయతీ ఎన్నికల్లో టిడిపి తరపున పోటీ చేసిన రవీంద్రరెడ్డితోపాటు పలువురు నాయకులు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. అనంతరం మంత్రి మడకశిర నియోజకవర్గంలో పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే వైసి తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎపి గోరంట్ల మాదవ్, గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిని పంప్‌హౌస్ వద్ద సత్యసాయి కార్మికుల అర్ధనగ్న నిరసన

సమస్య పరిష్కారమయ్యే వరకూ సమ్మె

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సత్యసాయి తాగునీటి కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు ఇచ్చిన హామీల మేరకు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికుల విషయంలో ప్రభుత్వం తన నిర్లక్ష్య వైఖరి వీడాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం చేసేంతవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. పోలీసులు, అధికారులు, కాంట్రాక్టర్ కార్మికులకు ఫోన్ చేయరాదన్నారు. ఇక పుట్టపర్తిలోని పంప్‌హౌస్ వద్ద సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. విధి లేని పరిస్థితులలో సమ్మెలోకి వెళుతున్నామన్నారు. వీరి నిరసనకు టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మద్దతు తెలిపారు.

ఆరేళ్లుగా సా...గుతున్న ఎడిబి పనులు

- కాకినాడ పోర్టు రహదారి విస్తరణలో జాప్యం
- 2017 నుంచి 2023 వరకు 35 శాతం పనులు
- రాజమండ్రి-కాకినాడ మధ్య తరచూ ప్రమాదాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ తీరంలో ఉన్న డీప్ వాటర్ పోర్ట్, యాంకరేజ్ పోర్టులకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ తదితర రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది వాహనాలు వస్తుంటాయి. ఈ పోర్టులో పామాలిన్ క్రూడ్, ఎరువుల దిగుమతులు, ఆఫ్రికా దేశాలకు బియ్యం, మలేషియా, సింగపూర్ తదితర దేశాలకు గ్రానైట్ వంటి ఎగుమతులు నిత్యం జరుగుతుంటాయి. విశాఖపట్నం తర్వాత ఎగుమతుల్లో ఈ పోర్టు అగ్రస్థానంలో ఉంది. ఇంతటి కీలకమైన రేవును జాతీయ రహదారితో అనుసంధానించడం వల్ల ఎగుమతి, దిగుమతులు మరింత ఊపందుకునే అవకాశాలు పెరుగుతాయని, పోర్టు నుంచి ఇతర జిల్లాలకు రోడ్డు రవాణా వ్యవస్థ మెరుగుపడనుందని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా రూ.300 కోట్ల ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) నిధులతో 2017లో సామర్లకోట-రాజనగరం రహదారి విస్తరణ పనులను రాష్ట్ర


ఎడిబి రోడ్డు విస్తరణలో భాగంగా గ్రావెల్, మట్టి వేసి వదిలేసిన రోడ్డు

ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (విసిఐసిడిపి) కింద ఉంది. కాకినాడ-రాజనగరం మధ్య 56 కిలోమీటర్ల రహదారిలో 38 కిలోమీటర్ల రహదారి అప్‌గ్రేడ్, 18 కిలోమీటర్ల మేర కొత్త రహదారిని డబుల్ లైన్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించాల్సి ఉంది. దీనిలో భాగంగా సామర్లకోట, పెద్దాపురం పట్టణాలకు కలిపి బై-పాస్ నిర్మాణం, పశ్చిమ ఏలేరు నదిపై ఒక ప్రధాన వంతెనను పునర్నిర్మించడం, ఇప్పటికే బలహీనంగా, ఇరుకుగా ఉన్న కల్వర్టులను పునర్నిర్మించడం, వాటిని విస్తరించడం, వివిధ ప్రదేశాల్లో కొత్త వంతెనలు, కల్వర్టుల నిర్మాణం పనులు నిర్వహించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ చేసి, చెట్లు తొలగించి, విస్తరణ పనులు ప్రారంభించారు. వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత చాలా రోజులు పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనుల్లో పురోగతి లేదు. భూసేకరణలో భాగంగా రంగంపేట, రాజానగరం ప్రాంతాల్లో కోర్టులో కేసులు ఉండడంతో ఈ రోడ్డు నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడం లేదు. మూడు ప్రధాన బ్రిడ్జిలు, 50 వరకూ కల్వర్టులు నిర్మించాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు 35 శాతం పనులు మాత్రమే పూర్తి కాగా భూసేకరణ సమస్యలను పరిష్కరిస్తేనే విస్తరణ పనులు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

వందల్లో ప్రమాదాలు

నిత్యం వేలాది వాహనాలు ప్రయాణం సాగించే రాజమండ్రి-కాకినాడ మధ్య రోడ్డు ఎక్కువ రద్దీగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిలో పెద్ద పెద్ద గుంతలు పడటంతో నరకప్రాయంగా ప్రయాణం మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే చిమ్మచీకటితో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక్క ఎడిబి రోడ్డులోనే ఏడాదికి సగటున 200లకు పైగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోగా ఆరేళ్లలో వందలాది మంది క్షతగాత్రులుగా మిగిలారు. ఇప్పటికీ తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పలుచోట్ల గ్రావెల్, కంకర కుప్పలు ఎక్కడపడితే అక్కడ ఉండటంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అదానిపై సెబీ విచారణ దాదాపు పూర్తి..!

- రెండు అంశాలు మినహా..
- సుప్రీంకోర్టుకు దర్యాప్తు స్థాయి నివేదిక

న్యూఢిల్లీ : అదానీ గ్రూపునపై రెండు ఆరోపణలు మినహా మిగతా అన్నింటిలో విచారణను పూర్తి చేశామని పెట్టుబడులు, మార్కెట్ రెగ్యూలేటరీ సంస్థ సెబీ వెల్లడించింది. ఈ విషయమై శుక్రవారం సుప్రీంకోర్టుకు సెబీ దర్యాప్తు స్థాయి నివేదికను అందించింది. బిలియనీర్ గౌతం అదానీ గ్రూప్ కంపెనీలు సెక్యూరిటీల చట్టాలను ఉల్లంఘించిందా లేదా అనే దానిపై దర్యాప్తు దాదాపు పూర్తయిందని పేర్కొంది. అదానీ గ్రూప్‌నకు చెందిన లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి మొత్తం 24 లావాదేవీలకు గానూ 22 లావాదేవీలపై తమ దర్యాప్తు పూర్తయ్యిందని సెబీ అందులో పేర్కొంది. మరో రెండు లావాదేవీలకు సంబంధించి ఇతర ఏజెన్సీల నుంచి సమాచారం రావాల్సి ఉందని తెలిపింది. అదాని కంపెనీల్లో



విదేశీ పెట్టుబడుల వెనుక ఉన్న అసలు యజమానుల సమాచారం కోసం ఇంకా ఎదురుచూస్తున్నామని సెబీ తన రిపోర్ట్‌లో పేర్కొంది. దర్యాప్తు ఫలితాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేసింది. సెబీ దర్యాప్తు నివేదికలలో స్టాక్ ధరల తారుమారు ఆరోపణలు, సంబంధిత పక్షాలతో లావాదేవీలను బహిర్గతం చేయడంలో వైఫల్యం, కొన్ని గ్రూప్ స్టాక్‌లలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు సంబంధించిన ఉల్లంఘనలు ఉన్నాయని సమాచారం. అదాని కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలు, ఎకౌంటింగ్ మోసాలు, కృత్రిమంగా షేర్ల ధరల పెంపు తదితర మోసాలకు పాల్పడుతోందని 2023 జనవరి 24న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీంతో అదాని షేర్లు కుప్పకూలడంతో సాధారణ ఇన్వెస్టర్లు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీనిపై విచారించాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఆగస్ట్ 14 కల్లా సెబీ తన విచారణను ముగించి నివేదికను ఇవ్వాలని ఆదేశించింది. కాగా.. విచారణ పూర్తి కాలేదని మరో 15 రోజుల సమయం కావాలని కోరడంతో అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా తన విచారణపై స్టేటస్ రిపోర్టును సమర్పించింది. ఈ కేసును ఆగస్టు 29న సుప్రీంకోర్టు విచారించనుంది.

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి

- సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకృతి సేద్య విధానాన్ని పెద్దయెత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ప్రకృతి సేద్యంపై వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. ప్రకృతి సేద్యాన్ని రైతులందరూ ఆచరించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గత ఏడేళ్లుగా రాష్ట్రంలో ప్రకృతి సేద్యం సాగులో సాధించిన విజయాలను రైతులకు వివరించాలని సూచించారు.

నేచురల్ ఫార్మింగ్ చేస్తున్న ప్రాంతాలన్నిటినీ ఇ-క్రాఫింగ్ చేసి ఇంటిగ్రేట్ చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించిన రాయితీలు, నాబార్డు, బ్యాంకులు, దాతల సహకారంతో ప్రకృతి సేద్యానికి సంబంధించి ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే దిశగా పయనించాలన్నారు. రాష్ట్ర రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో నేచురల్ ఫార్మింగ్ కింద ఇప్పటి వరకు 3,730 గ్రామాల్లో 8.50 లక్షల మంది నమోదయ్యారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పైపులైన్ పనులు వేగవంతం

గోదావరి జిల్లాల్లో నిర్మిస్తున్న గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లతోపాటు కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు నిర్మిస్తున్న నేచురల్ గ్యాస్ పైపులైన్ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిఎస్ జవహర్‌రెడ్డి అన్నారు. గ్యాస్ పైపులైన్ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. పైపులైన్ ఏర్పాటుకు సంబంధించిన ప్రగతిని, వివిధ అంశాలను రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడులశాఖ కార్యదర్శి ఎన్ యువరాజ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సిఎస్‌కు వివరించారు. ఈ సందర్భంగా సిఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ పైపులైన్ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న గోదావరి గ్యాస్ పైపులైన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ కమిషనరు కె ప్రవీణ్ కుమార్, ఎపి మారిటైమ్ బోర్డు డిప్యూటీ సిఇఒ రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్లు

- రూ.20కే అల్పాహారం
- ఒంగోలులో ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మెప్మా ఆధ్వర్యంలో ఒంగోలులో శుక్రవారం మూడు ఆహా క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఇందులో మధ్యాహ్నం, సాయంకాలం పూట సాంబారు అన్నం, పెరుగు అన్నం, పులిహార, వెజిటబుల్ ఫ్రైడ్ రైస్‌లలో ఏదో ఒకటి రూ.20కు అందిస్తారు. క్యాంటీన్‌లను నగరంలోని కొత్త కూరగాయాల మార్కెట్, రామ్‌నగర్‌లోని మినీ స్టేడియం వద్ద, రిమ్స్ వైద్యశాలలో ఏర్పాటు చేశారు. కూరగాయల మార్కెట్ వద్ద క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మరో వారం రోజుల్లో కొత్తగా మరో 15 ఆహా క్యాంటీన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. క్యాంటీన్‌లను అందుబాటులోకి తెచ్చిన మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్, కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వర్షాలకు ఢోకా లేదు

- ఉత్తరం నుంచి వెనక్కి రుతుపవనాలు
- రాష్ట్రంలో చురుగ్గా కదులుతున్న నైరుతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరం నుంచి రుతుపవనాలు తిరుగుముఖం పట్టిన నేపథ్యంలో ఈ ఏడాది వర్షాలకు ఢోకా లేదని, ఎక్కడికక్కడ ట్రఫ్ (వర్ష ద్రోణి)లు ఏర్పడుతున్నాయని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈ ఏడాది రాష్ట్రంలో పలుచోట్ల అసమతుల్య స్థితులు నెలకొన్నాయి. ఆగస్టు వచ్చినా ఉక్కబోత వీడలేదు. రుతుపవనాలు ఒక్కసారిగా ఉత్తరం వైపు అంటే హిమాలయ పర్వత శ్రేణులవైపు వెళ్లిపోవడమే దీనికి కారణం. తాజాగా ఉత్తరం నుంచి ఈ రుతుపవనాలు తిరుగుముఖం పట్టడం ఉపశమనం కలిగించే విషయం. ఈ నెల 23న ఏర్పడిన ఉత్తర, దక్షిణ ద్రోణితో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ఊహించింది. కానీ, ఇది 25 నాటికి బలహీనపడింది. తాజాగా ఎపి, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయి. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో శుక్రవారం వర్షం కురిసింది. రుతుపవనాలు చురుగ్గా ముందుకు సాగడం, ఉత్తర బంగ్లాదేశ్‌లో ఉపరితల ఆవర్తనం ఏర్పడడం, తూర్పు బంగాళాఖాతం వైపు ఒక ద్రోణి ఏర్పడడం వంటి కారణాలతో ఇక రాష్ట్రంలో వర్షాలకు లోటు ఉండదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఉత్తర బంగ్లాదేశ్‌లో ఉపరితల ఆవర్తనం ఒకటి సముద్రమట్టానికి 3.1 నుంచి 5.1 కిలోమీటర్ల ఎత్తులో శుక్రవారం ఏర్పడింది. ఇది ఆ ప్రాంతమంతా ఆవరించి ఉండడంతో దీని ప్రభావం తుపాను మాదిరిగా ఉండొచ్చని వాతావరణ శాఖ భావిస్తోంది. రాష్ట్రంలో పలుచోట్ల కొద్దిరోజుల వరకూ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

దళితుల అభివృద్ధికి కృషి

- జూపూడి ప్రభాకర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సామాజిక, న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దళితులకు చంద్రబాబు ఏనాడైనా మంచి చేశారా? అని ప్రశ్నించారు. దళితుల కోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. దళితుల కోసం జగన్ పనిచేస్తే.. చంద్రబాబు తన సొంత సామాజికవర్గం కోసమే పనిచేశారని ఆరోపించారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక, అబద్ధాలతో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

టెస్లాకు తలొగ్గిన కేంద్రం..!

- ఇవి కార్ల దిగుమతిపై సుంకం 15 శాతమే



న్యూఢిల్లీ : టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గినట్లు స్పష్టమవుతోంది. విదేశాల నుంచి దిగుమతయ్యే విద్యుత్ కార్లపై సుంకాన్ని భారీగా తగ్గిస్తూ కొత్త ఇవి పాలసీని తీసుకురానుందని రిపోర్టులు వస్తోన్నాయి. అదే జరిగితే టెస్లాతో పాటు పలు విదేశీ కార్ల కంపెనీలకు భారీగా లబ్ధి చేకూరనుంది. కొత్త పాలసీలో దేశీయంగా కార్ల తయారీ చేపడితే 100 శాతం నుంచి 15 శాతానికి దిగుమతి సుంకం తగ్గించే ప్రతిపాదన చేస్తున్నట్లు సమాచారం. కాగా.. ప్రస్తుతం దిగుమతి అవుతోన్న కార్లపై 70-100 శాతం పన్ను అమల్లో ఉంది. ఈ పన్ను శాతానికి భారీగా తగ్గించాలని అమెరికన్ పెట్టుబడిదారుడు ఎలన్ మస్క్ చాలా కాలం నుంచి భారత్‌ను డిమాండ్ చేస్తూ వస్తోన్నారు. అందుకు అనుగుణంగా కొత్త పాలసీని రూపొందిస్తోందని తెలుస్తోంది. కార్లకు సంబంధించి దేశీయంగా కొన్ని విడి భాగాలు తయారు చేసినా దిగుమతి సుంకాన్ని 15 శాతానికి తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందని సమాచారం. దీనిపై ప్రభుత్వం అధికారికంగా స్పందించాల్సి ఉంది. ప్రతిపాదిత కొత్త పాలసీ అమల్లోకి వస్తే టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి దేశీయ సంస్థలపై ఒత్తిడి నెలకొననుంది.

మరో భారత కార్పొరేట్ కంపెనీపై బాంబు..!

- హిండెన్‌బర్గ్ తరహా రిపోర్ట్

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ తరహాలోనే మరో అంతర్జాతీయ సంస్థ భారత కార్పొరేట్ల ఆర్థిక అవకతవకలపై త్వరలో నివేదికను విడుదల చేయనున్నట్లు సమాచారం. అదాని మోసాలపై ఈ ఏడాది ప్రారంభంలో హిండెన్‌బర్గ్ కీలక ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. మరో భారత కార్పొరేట్ దిగ్గజం అవకతవకలపై ప్రముఖ బిలియనీర్ జార్జ్ సోరోస్, రాక్‌ఫెల్లర్స్ బ్రదర్స్ వంటి దిగ్గజాలతో నడుస్తున్న ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) ఓ నివేదికను వెల్లడించనుందని ఆంగ్ల పత్రికలు కథనం ప్రచురించాయి. ఈ సంస్థ వ్యవస్థీకృత నేరాలపై నివేదికలు ఇస్తుంది. అయితే అది ఏ కార్పొరేట్ దిగ్గజంపైనా ఉండొచ్చనే విషయం తెలియాల్సి ఉంది. భారత కార్పొరేట్ కంపెనీల్లో విదేశీ పెట్టుబడులపైనే ఈ నివేదిక దృష్టి సారించనుందని సమాచారం.

సంపాదకీయం

మంచి - చెడు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమా అత్యధిక విభాగాల్లో అవార్డులు కైవసం చేసుకోవడం హర్షణీయం. దాదాపు ఏడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం జాతీయ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికై, ఈ ఘనత సాధించిన తొలి తెలుగు నటుడిగా రికార్డు సృష్టించిన అల్లు అర్జున్‌కు, వివిధ విభాగాల్లో అవార్డులు సాధించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్ర బృందానికి, ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచిన 'ఉప్పెన' టీమ్‌కు, 'కొండపొలం' సినిమాలో 'ధమ్‌ధమ్‌ధమ్' పాటకు ఉత్తమ గీత రచయితగా మరోమారు ఖ్యాతి గడించిన చంద్రబోస్‌కు, ఉత్తమ సంగీత దర్శకునిగా ఎంపికైన దేవీశ్రీప్రసాద్‌కు అభినందనలు. ఆరు దశాబ్దాల శాస్త్రవేత్తల కృషి చందమామపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడిస్తే.. ఏడు దశాబ్దాల తెలుగు చలనచిత్ర రంగ ఆకాంక్షలను 'పుష్పరాజ్' రూపంలో అల్లు అర్జున్ నెరవేర్చారు. ప్రజానాట్యమండలి ఘన వారసత్వంతో హాస్యనట శిఖరంగా అలరించిన అల్లు రామలింగయ్య మనవడిగా, దిగ్గజ సినీ నిర్మాత అల్లు అరవింద్ కుమారుడిగా ఆ హోదాలకే పరిమితం కాకుండా తనదైన కొత్త శైలితో, నటనా, నృత్య కౌశలంతో వెండితెరపై సత్తాచాటి సౌత్ ఇండియా స్టైలిష్ స్టార్‌గా కోట్లాది మంది ప్రేక్షకాభిమానాన్ని చూరగొనడం అల్లు అర్జున్ ప్రత్యేకత. ఎర్రచందనం దొంగలకు హీరోయిజాన్ని జోడించిన చిత్ర కథానాయకుడికి జాతీయ పురస్కారమా? అంటూ కొందరు పెదవి విరిచినా.. జాతీయ ఉత్తమ నట పురస్కారానికి అల్లు అర్జున్ నూటికి నూరు పాళ్లు అర్హుడేనని తెలుగు సినీ పరిశ్రమ యావత్తు గుండెలకు హత్తుకొని జేజేలు పలకడం ఆయన నటనా వైదుష్యానికి నిదర్శనం.

గురువారం ప్రకటించిన 69వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు తారలు వెలుగులు విరజిమ్మినందుకు హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నా.. వ్యవస్థలో వేళ్లానుకుపోయిన కుల వివక్ష జాఢ్యాన్ని ప్రశ్నిస్తూ సమాజాన్ని చైతన్య పరిచే 'జైభీమ్' లాంటి చిత్రాలకు అవార్డుల జాబితాలో చోటు దక్కకపోవడం పురస్కారాల ఎంపిక కమిటీ పారదర్శకతను ప్రశ్నార్థకం చేశాయి. కేంద్ర ప్రభుత్వ నిర్దేశంలో సంఘ్ పరివార్ మెప్పుల కోసమే జ్యూరీ పనిచేసినట్లుగా కొన్ని ఎంపికలు తేటతెల్లం చేస్తున్నాయి. మత విద్వేషాలు రాజేసే దురుద్దేశంతో సంఘ్ పరివార్ పెద్దల దిశానిర్దేశంతో వండివార్చిన కథాంశంతో అనేక వివాదాలు మూటగట్టుకొని తెరకెక్కిన 'ది కాశ్మీర్ ఫైల్స్'ను ఏకంగా జాతీయ సమగ్రత చిత్రంగా ఎంపిక చేయడం, అలాగే శత్రు దేశాల గూఢచారిగా పనిచేశారన్న ఆరోపణలతో వివాదాస్పద వ్యక్తిగా చరిత్రలో నిలిచిన 'నంబి నారాయణ్' జీవితకథ ఆధారంగా రూపొందించిన 'రాకెట్రీ- ది నంబీ ఎఫెక్ట్' చిత్రానికి జాతీయ ఉత్తమ చిత్రం పురస్కారం ప్రకటించడం జ్యూరీ నిర్ణయాల నిజాయతీని శంకిస్తున్నాయి. స్వేచ్ఛగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన రాజ్యాంగ సంస్థలు, అత్యున్నత విద్యా, సాంకేతిక, పరిశోధన సంస్థల్లో మనువాద జాఢ్యాన్ని జొప్పిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చివరకు చలన చిత్ర పరిశ్రమ పురస్కారాలకూ ఈ మకిలీని అంటించడం సిగ్గుచేటు. మతాల మధ్య విద్వేషాలు రాజేయడం ద్వారా సమాజాన్ని చీల్చి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో, ప్రజల భావోద్వేగాలను సొమ్ము చేసుకునే కుట్రపూరిత వ్యూహాల్లో భాగంగానే ది కాశ్మీర్ ఫైల్స్, ఆ తర్వాత ది కేరళ ఫైల్స్, రాకెట్రీ వంటి చిత్రాలు సంఘ్ పరివార్ దిశానిర్దేశంతో తెరకెక్కాయన్నది జగద్విదితమే. కుల వివక్ష నిర్మూలనకు కృషి చేసిన 'జైభీమ్' లాంటి చిత్రాలను విస్మరించడం, మత విద్వేషాలు రాజేసే 'ది కాశ్మీర్ ఫైల్స్' లాంటి చిత్రాలను నెత్తిన పెట్టుకోవడం జాతీయ పురస్కారాల స్థాయిని దిగజారుస్తాయి.

ఆశ్చర్యకరంగా బాలీవుడ్ ప్రధాన తారాగణం జాతీయ పురస్కారాలపై మౌనం దాల్చడం మరో విశేషం. సామాజిక మాధ్యమాల్లో చాలా క్రియాశీలకంగా వ్యవహరించే సూపర్ స్టార్ అమితాబ్ బచన్‌తో పాటు షారుఖ్‌ఖాన్, అక్షయ్ కుమార్, హృతిక్ రోషన్ తదితర తారలు కనీసం అభినందనలు కూడా చెప్పకపోవడం చర్చనీయాంశమైంది. అజయ్ దేవగణ్ ఒక్కరే 'రాకెట్రీ' బృందానికి అభినందనలు తెలిపినా.. తాను స్వయంగా నటించిన 'ఆర్‌ఆర్‌ఆర్' బృందానికి అభినందనలు చెప్పకపోవడం విస్మయం కలిగిస్తోంది. చాలా మంది బాలీవుడ్ నటులు తమ ఇండస్ట్రీకే చెందిన అలియా భట్, కృతి సనన్‌లకు పురస్కారాలు లభించినా ఎలాంటి స్పందన వ్యక్తం చేయకపోవడం జాతీయ చలన చిత్ర పురస్కారాల పట్ల బాలీవుడ్ అసంతృప్తికి దర్పణం పట్టింది. ఏదేమైనా సాహిత్యం, ప్రజా కళలు, చిత్ర రంగం ప్రజలను ప్రభావితం చేసే శక్తిమంతమైన మాధ్యమాలు. స్వార్థపూరిత స్వీయ రాజకీయ ప్రయోజనాల కోసం వీటిని ఉపయోగించుకోజూడడం విచారకరం. స్వేచ్ఛగా, స్వతంత్రంగా సాహిత్యం, కళలు వర్ధిల్లేలా చూడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపైనా ఉంది.

మంచి మాట




నువ్వు ఎంత ఇస్తున్నావనేది కాదు.
ఎంత ప్రేమగా ఇస్తున్నావనేదే ముఖ్యం.
- మదర్ థెరిసా



నుహ్‌లో హింస, విధ్వంసం వెనుక ...

వ్యాఖ్య





ఇస్మత్ ఆరా

హర్యానా లోని నుహ్‌కు, ఢిల్లీ నుండి గంట ప్రయాణం. ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న నుహ్ జిల్లాలో, పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత ఎక్కువ. ఈ ప్రాంతానికి మత ఉద్రిక్తతల చరిత్ర ఉంది. జులై 31న కూడా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ధ్వంసమైన వాహనాలు, దగ్ధమైన దుకాణాలు భయోత్పాతాన్ని గుర్తుచేస్తాయి.

ఇద్దరు హోమ్ గార్డులు, నలుగురు పౌరులు మొత్తం ఆరుగురు ఈ ఘర్షణల్లో చనిపోయారు. ఘర్షణల వార్తలు పల్వాల్, సోహ్నాతో పాటుగా నుహ్‌కు పొరుగున వున్న గురుగ్రామ్, ఇతర ప్రాంతాల్లోనూ విన్పించాయి. గురుగ్రామ్ నడిబొడ్డున ఒక మసీదును దగ్ధం చేశారు. సెప్టెంబర్ నెలలో ఢిల్లీలో జరిగే జి-20 దేశాల శిఖరాగ్ర సమావేశాన్ని దృష్టిలో ఉంచుకొని దేశ రాజధాని ప్రాంతంలో, నుహ్‌లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పోలీసులు పెద్ద ఎత్తున ముస్లిం యువకుల్ని కట్టడి చేస్తూ చర్యలు చేపట్టి, మైనర్లను కూడా నిర్బంధించసాగారని స్థానిక ముస్లింలు ఆరోపించారు. ఆగస్టు 3వ తేదీ వరకు హింసకు సంబంధం ఉందన్న పేరుతో 176 మందిని అరెస్ట్ చేసి, 90 మందిని నిర్బంధించి, 93 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

పోలీసుల సమాచారం ప్రకారం, విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) నిర్వహించిన బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్ర, శివాలయం నుండి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖేద్లా మోడ్ దగ్గరకు చేరినపుడు ఒక మతానికి చెందిన యువకులు ఆ యాత్ర పైన రాళ్ళు రువ్వడంతో సమస్య మొదలైంది. వాడి వేడి మాటలతో మొదలైన ఘర్షణ రాళ్ళ వర్షంగా మారిందని స్థానికులు అంటున్నారు. సామాజిక మాధ్యమంలో వచ్చిన వీడియోల్లో ఇరువర్గాల వారు కత్తులు, ఇనుప రాడ్లు, కర్రలు, తుపాకుల్లాంటి మారణాయుధాలతో కనిపించారు. యాత్రలో భాగస్వాములైన వందలాది మంది శివాలయంలో తలదాచుకున్నారు, తరువాత పోలీసులు వారిని బయటకు తీసుకొచ్చారు. ఆ వెంటనే సామాజిక మాధ్యమాల్లో, ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న నుహ్ లాంటి ప్రాంతాల్లో హిందువులకు రక్షణ లేదని, హిందూత్వ సంస్థల సభ్యులు కథనాలను వ్యాప్తి చెయ్యనారంభించారు.

పోలీసులు పహారా కాస్తున్నప్పటికీ, ఆ రాత్రి గురుగ్రామ్ సెక్టార్57 లోని అంజుమన్ జమా మసీద్‌కు డిప్యూటీ ఇమామ్‌గా ఉన్న హఫీజ్ సాద్, మూక దాడిలో చనిపోయాడు. బీహార్ లోని సితా మర్హీకి చెందిన అతడు సంవత్సరం క్రితమే అక్కడికి వచ్చాడు. స్థానికుల కథనం ప్రకారం, అర్ధరాత్రి సమయంలో సాయుధ మూక మసీదుపై దాడి చేసి, నిప్పంటించింది. సాద్ సుమారు రాత్రి 2 గంటల సమయంలో చనిపోయాడని అతని సోదరుడు షాదాబ్ చెప్తున్నాడు. రాత్రి 11.30 గంటలకు సాద్ తన అక్కకు ఫోన్ చేస్తే, ఆమె బీహార్ తిరిగి వచ్చేయమని చెప్పగా, మసీదుకు రక్షణగా చుట్టూ పోలీసులు ఉన్నారని, భయపడాల్సిన అవసరం లేదని చెప్పాడు. దాడిలో ఛాతీపై అనేక కత్తిపోట్లు పొడవడంతో చనిపోయాడని షాదాబ్ చెప్పాడు. మసీదులో ఉన్న మరో వ్యక్తిని కూడా తీవ్రంగా కొట్టి గాయపరిచారు. అతనింకా ఐసియూ లోనే ఉన్నాడు. నేరస్తులను గుర్తించే పనిలో ఉన్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులంటున్నారు.

ఈ హింసకు ప్రధాన ఉత్ప్రేరకంగా రెండు వీడియోలు పని చేసినట్లు కనిపిస్తోంది. ఒకటి, ఇద్దరు ముస్లింలను చంపిన నేరంలో ప్రధాన నిందితుడు, పరారీలో వున్న గోరక్షక దళ సభ్యుడైన మోనూ మనేసార్ వాట్సప్ ద్వారా పంపిన వీడియో. మరొకటి ఫరీదాబాద్ గోరక్షక బజరంగ్ ఫోర్స్ యూనిట్ ఇన్చార్జ్ బిట్టూ బజరంగీ జులై 31 ఉదయం 11 గంటలకు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన లైవ్ వీడియో. విహెచ్‌పి యాత్రలో మోనూ మనేసార్ పాల్గొంటున్న ఉద్దేశ్యాన్ని బిట్టూ ఆ వీడియోలో చెప్పాడు. "నేను మీకు (ముస్లింలకు) ముందుగానే చెప్తున్నాను. మీ బావ గారు (మోనూ మనేసార్) ఇక్కడ సందర్శనకు వస్తున్నాడు. మేం మళ్ళీ మీకు చెప్పలేదని అనొద్దు. ఆయన కోసం పూలు, పూలదండలతో సిద్ధంగా ఉండండి" అని బిట్టూ బజరంగీ ఆ వీడియో ద్వారా చెప్పాడు.

మోనూ మనేసార్ హర్యానాలో స్వయం ప్రకటిత గోరక్షకుడు. ఆవుల్ని దొంగ రవాణా చేస్తున్నారన్న అనుమానంతో ఫిబ్రవరి 16వ తేదీన బజరంగ్‌దళ్ సభ్యులు నాసిర్, జునైద్‌లను కిడ్నాప్ చేసి, హత్య చేసిన నేరాల్లో మోనూ ప్రధాన నిందితుడు. కారు లోకి ఎక్కించి, సజీవ దహనం చేయడానికి ముందు వారిని అనాగరికంగా కొట్టారు. వారిరువురూ రాజస్థాన్ లోని గోపాల్‌గఢ్ గ్రామానికి చెందిన వారు. నాసిర్, జునైద్‌లను హత్య చేసినందుకు మోనూపై మే నెలలో రాజస్థాన్ పోలీసులు కేసు మోపారు. కానీ, అతన్ని పట్టుకోలేక పోయారు. రాజస్థాన్‌లో కొన్ని ప్రాంతాలకు విస్తరించిన మేవత్‌లో ఈ కేసు ఒక సున్నితమైన సమస్యగా మిగిలింది. నుహ్‌ను సందర్శించాలన్న మోనూ నిర్ణయంతో ఆగ్రహించిన కొందరు ముస్లిం యువకులను (బిట్టూ సవాల్‌కు ప్రతిస్పందనగా) ఎదురు దాడి చేయడానికి సిద్ధంగా ఉండేట్లు ఉసిగొల్పారు.

"సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్ట్ చేసినపుడు, ఆ ప్రాంత ప్రజల మానసిక స్థితి పూర్తిగా మారిపోయింది. జునైద్, నాసిర్‌ల హత్య కేసులో మోనూ నిందితుడు. ప్రజలు భావోద్వేగాలకు లోనయ్యారు. అయితే అక్కడ ఏమీ జరగనట్టు, మోనూ, నుహ్ సందర్శిస్తానని చెప్పాడు" అని ఉలామా-ఈ-హింద్ సభ్యుడు ముఫ్తీ సలీం చెప్పాడు. ఆగస్ట్ 1వ తేదీన విహెచ్‌పి, బజరంగ్‌దళ్, జమైత్ ఉలామా-ఈ-హింద్ ప్రతినిధులు పాల్గొన్న శాంతి సమావేశానికి ఇతను కూడా హాజరయ్యాడు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు కొనసాగడంతో శాంతి సమావేశం వల్ల ఫలితం లేకుండా పోయింది.

ముస్లిం యువకులను కోపోద్రిక్తులను చేసి, వారు ప్రతిస్పందించేలా చేయాలనే ఉద్దేశం లేనట్లయితే నాసిర్, జునైద్‌ల హత్యా నేరంలో నిందితుడైన మోనూను ఇక్కడికెందుకు ఆహ్వానించాలని-గాంధీగ్రామ్ నివాసి, నుహ్‌లో టీ కొట్టు నిర్వాహకుడు అయిన మహమ్మద్ అయూబ్ అంటున్నాడు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఘర్షణలు సృష్టించాలనే ఉద్దేశ్యం విహెచ్‌పికి ఉందని అదే ప్రాంత నివాసి మౌజ్‌ఖాన్ అభిప్రాయపడుతున్నాడు. బిజెపి హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకుపోయే లక్ష్యంతోనే ముస్లింలు అధిక సంఖ్యలో ఉండే ప్రాంతాల్లో ఇలాంటి ఘర్షణల్ని సృష్టించి, హిందువులు ప్రమాదంలో ఉన్నారనే కథనాలను వ్యాపింప చేస్తున్నారని ఆయన అన్నాడు.

> హింస మొదలైనప్పుడు, అధికారులు తగిన రీతిలో స్పందించకపోవడం వల్లే పరిస్థితులు ఇంత దూరం వచ్చాయనే అభిప్రాయాన్ని స్థానికులు వెలిబుచ్చారు. హింసను నివారించడంలో అధికారుల వైఫల్యం గురించి మాట్లాడుతూ, మహిళా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను చుట్టుముట్టిన మూకల నుండి ఆమెను రక్షించడంలో తాను సహకరించానని సీనియర్ న్యాయవాది రంజన్ చౌదరి అన్నారు. ఆమెను బయటకు తీసుకురావడానికి, రక్షణగా ఉండటానికి పోలీసులు నిరాకరించారు. ప్రచారంలో ఉన్న వీడియోలను పరిశీలించి, వాటిలో బహిరంగ బెదిరింపులకు దిగిన వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నుహ్ అడిషనల్ ఎస్పీ ఉషా కుందూకు చేసిన అభ్యర్థనలను వారు పట్టించుకోలేదని చౌదరి అన్నారు.

వచ్చే సంవత్సరం జరగబోయే సాధారణ ఎన్నికలు, హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో హిందువుల మద్దతు పొందే లక్ష్యంతోనే మేవాత్ ప్రాంతంలో మత ఉద్రిక్తతలు సృష్టించే ప్రణాళికను బిజెపి రచించిందని-శాంతి సమావేశ భాగస్వామి, స్వరాజ్ ఇండియా పార్టీ నాయకుడు యోగేంద్ర యాదవ్ అంటున్నారు. వీడియోల ద్వారా హింసను ప్రేరేపించిన బజరంగ్‌దళ్ సభ్యులకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు.

హింస మొదలైనప్పుడు, అధికారులు తగిన రీతిలో స్పందించకపోవడం వల్లే పరిస్థితులు ఇంత దూరం వచ్చాయనే అభిప్రాయాన్ని స్థానికులు వెలిబుచ్చారు. హింసను నివారించడంలో అధికారుల వైఫల్యం గురించి మాట్లాడుతూ, మహిళా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ను చుట్టుముట్టిన మూకల నుండి ఆమెను రక్షించడంలో తాను సహకరించానని సీనియర్ న్యాయవాది రంజన్ చౌదరి అన్నారు. ఆమెను బయటకు తీసుకురావడానికి, రక్షణగా ఉండటానికి పోలీసులు నిరాకరించారు. ప్రచారంలో ఉన్న వీడియోలను పరిశీలించి, వాటిలో బహిరంగ బెదిరింపులకు దిగిన వారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ నుహ్ అడిషనల్ ఎస్పీ ఉషా కుందూకు చేసిన అభ్యర్థనలను వారు పట్టించుకోలేదని చౌదరి అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలు ఇంకా చక్కర్లు కొడుతున్నాయి కాబట్టి అధికార యంత్రాంగానికి చర్యలు తీసుకునే ఉద్దేశం లేదనేది స్పష్టం అవుతుంది. సామాజిక మాధ్యమాల్లో బెదిరింపులకు గురిచేస్తున్న పోస్టులను తీసివేయలేదు, ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని ముందు జాగ్రత్త చర్యగా నిర్బంధంలోకి తీసుకోలేదని విమర్శకులు అంటున్నారు. హింస చెలరేగిన తరువాత మాత్రమే ప్రభుత్వం ఆ ప్రాంతంలో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసి, దానిని ఆగస్టు 5 వరకు పొడిగించింది. ఈ క్రమంలో, పరిస్థితిని చక్కదిద్దడంలో అధికారుల తీరుపై బిజెపి పాలకపక్ష సభ్యులు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. గురుగ్రామ్ ఎంపీ, కేంద్రమంత్రి రావు ఇంద్రజిత్ సింగ్, నుహ్ హింసపై మాట్లాడుతూ.... యాత్రలో పాల్గొన్నవారు కత్తులు, కర్రలు చేబూనడం సరైంది కాదన్నారు. వారికి ఆయుధాలెవరిచ్చారు? కత్తులు, కర్రలు పట్టుకుని ప్రదర్శనకు ఎవరు వెళ్తారు? అంతమాత్రాన అవతలివైపు నుండి ప్రేరేపిత చర్యల్లేవనడం లేదని ఆయన చెప్తున్నాడు. యాత్రకు అనుమతిచ్చే సందర్భంలో, యాత్రలో ఖచ్చితంగా ఆయుధాలు లేకుండా చూడాలని నిర్వాహకులకు చెప్పినట్లు నుహ్ డిప్యూటీ కమిషనర్, ప్రశాంత్ పన్వర్ మీడియాతో అన్నారు. 2016, ఫిబ్రవరిలో 10 రోజులపాటు రాష్ట్రాన్ని కలవరపరచిన హింసాత్మక జాట్ నిరసనల సందర్భంలో కూడా మనోహర్‌లాల్ ఖట్టర్ నాయకత్వం లోని ప్రభుత్వం మొద్దు నిద్ర పోయింది. అప్పుడు చెలరేగిన హింసను అదుపు చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలు న్నాయి. ఈసారి హర్యానాలో చెలరేగిన హింస, పేద ముస్లింలు నివసించే ప్రాంతాలకు విస్తరించింది. వారు అధికారుల ఒత్తిడిని కూడా ఎదుర్కొనాల్సి వస్తోంది. ఆగస్టు 4న, అధికారులు నుహ్‌లో ముస్లిం వలస కార్మికులకు చెందిన 250 గుడిసెలు, పాకలను కూల్చివేశారు. అయితే, ఇవి ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలని అధికారులు ఆరోపిస్తున్నారు. హింస వెనుకున్న కుట్రను బట్టబయలు చేసి, నేరస్తులను శిక్షిస్తామని ముఖ్యమంత్రి ఖట్టార్ అంటున్నారు. ఆస్తులు కోల్పోయిన వారికి నష్టపరిహారాన్ని ప్రకటించారు. మానేసార్‌ను పట్టుకునేందుకు వేట మొదలైందన్నారు.

ఈ క్రమంలో ఆగస్ట్ 2వ తేదీన నుహ్, గురుగ్రామ్‌లో అల్లర్లు జరిగిన తర్వాత విహెచ్‌పి, బజరంగ్‌దళ్ తలపెట్టిన ప్రదర్శనలను నిలుపుదల చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ దరఖాస్తు దాఖలైంది. ప్రదర్శనల్లో ఎలాంటి విద్వేషపూరిత ప్రసంగాలు లేకుండా కేంద్రం హామీ ఇవ్వాలని, ప్రదర్శనలు నిర్వహించే సందర్భంలో భద్రతా కారణాల రీత్యా అదనపు బలగాలను మోహరింప చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

('ఫ్రంట్‌లైన్' సౌజన్యంతో)

శ్రామిక మహిళలకు ఉద్యోగ భద్రత ఏది?

ఉద్యమం



కె. ధనలక్ష్మి

మహిళా సాధికారత గురించి ఏలికలు గొప్పలు చెప్పడమే గాని ఆచరణలో అడుగు ముందుకు వేయడం లేదు. పని ప్రదేశాలలో మహిళలకు కనీస వసతులు కల్పించడంలో యాజమాన్యాలు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ఇలా వుండగా మహిళలతో రాత్రుళ్లు కూడా పని చేయించేందుకు వీలుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చట్టాలలో మార్పు చేస్తోంది. దీంతో శ్రామిక మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుంది.

కనీస వసతుల లేమి

పని ప్రదేశాలలో మహిళలకు ప్రత్యేక వసతులు కల్పించాలని చట్టాలు సూచిస్తున్నాయి. ఆచరణలో మాత్రం మహిళలకు ఆ విధంగా సౌకర్యాలు కల్పిస్తున్న దాఖలాలు చాలా పరిమితం. దీని మూలంగా మంచినీళ్లు ఎక్కువ తాగితే టాయిలెట్‌కి వెళ్ళాల్సి వస్తుందని భయపడి రోజుకు 8 నుండి 9 గంటల పని సమయంలో గుక్కెడు నీళ్లు కూడా తాగకుండా విధులు నిర్వహిస్తున్నారు. షాప్ ఎంప్లాయీస్ రోజంతా నిలువు కాళ్ళ మీద నిలబడాలి. బహుళజాతి సంస్థలైన బ్రాండిక్స్ వంటి కంపెనీలలోనే టాయిలెట్‌కి వెళ్లి రావటానికి యాజమాన్యం టైమ్ నిర్దేశించడం కార్మికుల్లో భయాందోళనలను కలిగిస్తున్నది. వీటి మూలంగా అత్యధిక మంది శ్రామిక మహిళలు గర్భసంచి వ్యాధులకు గురవుతున్నారు.

కొరవడిన కనీస వేతనాలు

కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, ఎన్‌హెచ్‌ఎం, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, మధ్యాహ్న భోజన పథకం, సర్వశిక్ష అభియాన్, ఉపాధి హామీ వంటి పథకాలలో అత్యధిక మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరెవరికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు. స్కీమ్ వర్కర్లను సైతం కార్మికులుగా గుర్తించటం లేదు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారిని వర్కర్లుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని 44వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) సిఫార్సు చేసింది. అందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే గత ఏడెనిమిదేళ్లుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ సిఫార్సులను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న వారికి కనీస వేతనాల ఊసే లేదు. ఇక ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, షాపులు తదితర సంస్థలలో నెలకు రూ. 5000 నుండి రూ. 12,000 లోపు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారు. పని గంటలు, ప్రమాద బీమా, గ్రాట్యుటీ, ఇ.పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ సౌకర్యాల మాటే లేదు.ఆక్వా , బీడీ, చింత పిక్కలు, జీడిపప్పు తదితర పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితి వర్ణనాతీతం. బీడీల తయారీలో ఇంటిల్లపాది పని చేసినా తిండికి గడవని పరిస్థితి. ఇక చింతపిక్కలు, జీడిపప్పు సంస్థల్లోని మహిళా కార్మికులకు వేతనాలు ఎప్పుడు పెరుగుతాయో, ఎంత పెరుగుతాయో, అసలు జీవోలు ఎంత నిర్ణయిస్తున్నాయో కూడా తెలియని స్థితిలో బతుకులీడుస్తున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు-పట్టించుకోని ప్రభుత్వం

అంగన్వాడి ఉద్యోగులకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ జీతం చెల్లిస్తామని గద్దెనెక్కిన సందర్భంగా వైయస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి నాలుగున్నరేళ్ళు గడుస్తున్నా ఈ హామీని నెరవేర్చలేదు. పైపెచ్చు ఇంటి అద్దెలు, టిఏ, డిఏ లు నాలుగేళ్లుగా చెల్లించిన దాఖలాలు లేవు. రోజుకో యాప్ ప్రారంభించి వర్కర్ల నెత్తి మీద భారం మోపుతున్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు పని భద్రత లేకుండా అక్షయ పాత్ర, ఇస్కాన్ వంటి ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్నారు. వీరికి వంట గ్యాస్ బిల్లులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఐకెపి వివోఏ లకు మార్కెట్ల పేరుతో తలకు మించిన భారం పెట్టి బలవంతంగా సరుకులు కొనిపిస్తున్నారు. వేలాది మంది మహిళా చిరుద్యోగులను ఉద్యోగాల నుండి తొలగించారు. ఎమర్జన్సీ పేరుతో ఆశా వర్కర్లకు సెలవులు ఇవ్వకుండా 24 గంటలు చాకిరీ చేయిస్తున్నారు.

'జగనన్నకి చెబుదాం' వంటి పేర్లు పెట్టి ప్రభుత్వమే అధికార పార్టీ ప్రజా ప్రతినిధులను గడపగడపకు తిప్పుతున్నది. ఈ సందర్భంగా ఎవరు ఏ సమస్యలు ఎదుర్కొన్నారో చెప్పమని అడుగుతున్న ప్రభుత్వమే...తమ సమస్యల గురించి చెప్పిన శ్రామిక మహిళలను నిర్దాక్షిణ్యంగా ఉద్యోగాల నుండి ఊడబెరుకుతున్నది. గత మార్చిలో గుంటూరు నగరంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు విమల ఆ విధంగానే ఉద్యోగం నుండి తొలగించబడింది. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ మీటింగ్‌కు వెళ్లారనే సాకుతో ముగ్గురు మున్సిపల్ పారిశుధ్య మహిళా కార్మికులను నిరంకుశంగా ఉద్యోగాల నుండి తొలగించారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానన్న వాగ్దానం నెరవేరలేదు. సిపిఎస్ రద్దు కోసం పోరాటాలు కొనసాగుతూనే వున్నాయి. ఉద్యోగ కార్మికులలో వస్తున్న అసంతృప్తిని బయట పడకుండా చేయటానికి ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది.

భవన నిర్మాణ రంగంలో రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది వరకు పనిచేస్తుండగా అందులో శ్లాబ్ ముఠా, పునాదులు తదితర పనులలో మహిళలే అధికం. గత టిడిపి ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కూడా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను దారి మళ్లించి అడ్డగోలుగా వాడుకోవడం వల్ల కార్మిక సంక్షేమ పథకాలన్నీ కూడా నిలిచిపోయాయి. మరోవైపు ఇసుక దందా మూలంగా కరోనాలో కరోనా తరువాత, కూడా కార్మికులకు చేతి నిండా పని లేకుండా పోయింది. ఇంకోవైపు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎడాపెడా భారాలు మోపుతున్నాయి. పెరిగిన నిత్యావసరాల ధరలకు ఈ భారాలు తోడు కావడంతో భవన నిర్మాణ మహిళా కార్మికులు పస్తులతో బతకాల్సి వస్తున్నది.

రాష్ట్రంలో గత కొన్నేళ్లగా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు వంటి వాటిల్లో మహిళా కార్మికులనే నియమిస్తున్నారు. భోజనాలు వడ్డించడం, బల్లలు తుడవడం, కంచాలు కడగడం కూడా వీరే చేయాల్సి ఉంటుంది. రోజంతా నిలువు కాళ్ల మీదే పని చేయాలి. రోజుకు 10 నుండి 11 గంటలు చాకిరీ చేయాలి. ఇంత చేస్తున్నా హోటళ్లలో మిగిలిపోయిన టిఫిన్లు, భోజనాలు కూడా ఈ కార్మికులకు పెట్టరు. పైగా జీతం నెలకు రూ.7000 నుండి రూ.8000 లోపు మాత్రమే ఇస్తారు.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో, వార్డు సచివాలయాలలో పని చేసే మహిళా కార్మికుల దుస్థితి వర్ణనాతీతం. ఈ కాలంలో అనేక చోట్ల లైంగిక వేధింపులకు, అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు వీరు గురవుతున్నారు. నెల్లూరులో వికలాంగురాలైన వార్డు వాలంటీర్‌ను అధికార పార్టీ నాయకుడు దుర్భాషలాడి దౌర్జన్యానికి పాల్పడిన ఘటన ఇటీవల చోటుచేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు మున్సిపల్ ఉద్యోగినిపై అధికారి లైంగిక వేధింపులకు పాల్పడినప్పుడు...సిఐటియు జోక్యం చేసుకొని ఆ మహిళలకు అండగా నిలబడి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారిపై చర్యలు తీసుకోక తప్పలేదు. ఈ నేపథ్యంలో...పని ప్రాంతాలలో రక్షణ కోసం, కనీస వసతుల కోసం, కనీస వేతనాల కోసం, ఉద్యోగ భద్రత కోసం...శ్రామిక మహిళలు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాల్సి వుంది.

/ వ్యాసకర్త శ్రామిక మహిళా రాష్ట్ర సమన్వయ కమిటీ కన్వీనర్ /



> కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఐసిడిఎస్, ఎన్‌హెచ్‌ఎం, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, మధ్యాహ్న భోజన పథకం, సర్వశిక్ష అభియాన్, ఉపాధి హామీ వంటి పథకాలలో అత్యధిక మంది మహిళలు పనిచేస్తున్నారు. వీరెవరికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు. స్కీమ్ వర్కర్లను సైతం కార్మికులుగా గుర్తించటం లేదు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారిని వర్కర్లుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని 44వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) సిఫార్సు చేసింది. అందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అయితే గత ఏడెనిమిదేళ్లుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ సిఫార్సులను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నది.

ఆగస్టు 27న కృష్ణా జిల్లా గుడివాడలో శ్రామిక మహిళల రాష్ట్ర సదస్సు

జనవాక్యం

భాష - భావం

మహిళలను ఉద్దేశించి న్యాయమూర్తులు తమ తీర్పుల్లో, ఆదేశాల్లో వాడకూడని పదాల్ని, పదబంధాల్ని క్రోడీకరించి అత్యున్నత న్యాయస్థానం ఒక పుస్తకాన్ని తెచ్చింది. అనాదిగా మహిళల పట్ల సమాజంలో నెలకొన్న ముద్రలను, పురుషాధిక్య భావనలను బలపరిచేలా న్యాయస్థానం భాష ఉండకూడదన్నది ముఖ్య ఉద్దేశ్యం. పతిత, పతివ్రత, స్త్రీ సహజ బలహీనత లాంటి విశేషణాల వల్ల అంతిమంగా ఆయా భావాలకు ఆమోదముద్ర లభించి, సమాజంలో స్థిరపడతాయి. న్యాయమూర్తుల తీర్పుల్లో కూడా ప్రభావం చూపుతాయి. నేరాన్ని చూసే పద్ధతి లో అవాంఛనీయ ధోరణికి అవకాశం ఉంటుంది. వీటిని సరిదిద్ది, నేడు సుప్రీం కోర్టు తమ భాషలో సంస్కారాన్ని నిలిపే కృషి చెయ్యడం ముదావహం. మహిళా లోకం పట్ల సున్నితమైన, సానుకూలమైన స్పందన. ఇదే విధంగా నేరాల్ని అభివర్ణించడంలో కూడా ముందడుగు వెయ్యాలి. ఉదాహరణకు 'పరువు హత్య' అన్న పదం ఏదో ఘనకార్యంలా వినబడుతుంది. అలా అనకుండా 'క్రూర హత్య'గానే దాన్ని పిలవాలి. మీడియా, పౌర సమాజం, నేతలు న్యాయస్థానం తీసుకున్న నిర్ణయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి. భాషలో సున్నితత్వం పెంచాలి. ప్రాంతాన్ని, కులాన్ని, ఆకారాన్ని, మతాల్ని తక్కువ చేస్తూ వాడుకలో ఉన్న పదాల్ని పరిహరించాలి. అదే ఆరోగ్యకరమైన, నాగరికమైన ధోరణి.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

గోల్‌మాల్ భారత్‌మాల

అవకతవకలు బయటపెట్టిన కాగ్

మోడీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమం భారత్‌మాల ప్రాజెక్టు మొదటి దశ పనుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయా? అదానీ కంపెనీలకు లబ్ధి చేకూరే ప్రయత్నాలు జరిగాయా? బిజెపి నాయకుడి కంపెనీ కూడా ఇందులో ఉన్నదా? కాషాయ పార్టీకి విరాళాలు అందించిన కంపెనీలూ దీని కింద లబ్ధిని పొందాయా? అంటే కాగ్ నివేదిక అవుననే చెపుతున్నది. అదానీ నేతృత్వంలోని కన్సార్టియంతో పాటు మరికొన్ని కంపెనీలు భారత్‌మాల ప్రాజెక్టు మొదటి దశ కింద నిబంధనలు ఉల్లంఘించి మరీ టెండర్లను పొందాయని తెలుస్తున్నది. సరైన అనుభవం లేనప్పటికీ రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులను దక్కించుకున్నట్టు కాగ్ నివేదిక వెల్లడిస్తున్నది. ఈ ప్రాజెక్టు కింద పనులను పొందిన కంపెనీలకు కేంద్రంలోని అధికార బీజేపీతో ప్రత్యంక్షంగానో, పరోక్షంగానో సంబంధాలు ఉన్నట్టు తెలుస్తున్నది.



- **అనుభవం లేకున్నా అదానీ కన్సార్టియంకు పనులు**
- **జాబితాలో బిజెపి నేత కంపెనీ కూడా..**
- **కాషాయ పార్టీకి విరాళాలు అందించిన మరో నాలుగు కంపెనీలకూ పనులు**
- **వీటి నుంచి రూ.77 కోట్లకు పైగా విరాళాలు**
- **యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనలు**

న్యూఢిల్లీ : మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చాక..కార్పొరేట్లను ప్రసన్నం చేసుకోవటంలోనే తలమునకలైంది. పార్టీకి విరాళాలిచ్చే పెద్దలకు కావాల్సిన పనులను అప్పగించేందుకు వెనుకాడటంలేదు. దీనికి ఉదాహరణకు అదానీ ట్రాన్స్‌పోర్ట్ నేతృత్వంలోని కన్సార్టియం... హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో తెలంగాణలోని సూర్యాపేట నుంచి ఖమ్మం మధ్య జాతీయ రహదారిని నాలుగు–లేన్‌లుగా చేసే ప్రాజెక్ట్‌ను పొందింది. అయితే, హైవే సెక్టార్‌లో నిర్మాణ పనుల్లో అనుభవం కలిగి ఉండాలనే షరతు ఉన్నది. దానిని అదానీకి చెందిన కంపెనీ సంతృప్తిపర్చలేదు. అయినప్పటికీ అదానీ కన్సార్టియంకే ఈ ప్రాజెక్టు అందటం గమనార్హం. అలాగే, బీజేపీ నాయకుడు నవీన్ జైన్ ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ అయిన పీఎన్‌ఆర్ ఇన్ఫోటెక్‌కు 2019 ఆగస్టులో లక్నో రింగ్ రోడ్ యొక్క ప్యాకేజీ 1 కాంట్రాక్ట్‌ను మొదట అంచనా వేసిన దానికంటే 17.44 శాతం అధిక ధరతో అందించారు. బిడ్ ధర సవరించిన అంచనాల కంటే 2.02 శాతం పెరిగింది. ఆ సమయంలో జైన్ ఆగ్రా మేయర్‌గా ఉండటం గమనార్హం. దీంతో ఇందులో అధికార దుర్వినియోగం కూడా జరిగిందనే ఆరోపణలు వచ్చాయి.

2013 నుంచి 2021 మధ్య కాలంలో బీజేపీకి రూ. 77 కోట్లకు పైగా విరాళం ఇచ్చిన నాలుగు కంపెనీలు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్, జె కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, లార్సెన్ అండ్ టూబ్రో, ఎంకేసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌లతో అక్రమాలకు పాల్పడినట్టు కాగ్ నివేదిక పేర్కొన్నది.

అదానీ ట్రాన్స్‌పోర్ట్ కన్సార్టియం

కన్సార్టియంలో అదానీ సంస్థకు 74 శాతం సింహభాగం ఉన్నది. అయితే, సదరు కన్సార్టియం హైవే సెక్టార్‌లో నిర్మాణ పనుల్లో ఐదేండ్ల అనుభవానికి సంబంధించిన షరతును నెరవేర్చలేదు. బిడ్డర్ సమర్పించిన పనుల జాబితా ప్రకారం కంపెనీ "ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా" ఎటువంటి నిర్మాణ పనులను ఎప్పుడూ నిర్వహించలేదు. ఏది ఏమైనప్పటికీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) 2019 మార్చిలో రూ. 1,566.30 కోట్ల బిడ్ ప్రాజెక్ట్ వ్యయంతో ఎటువంటి అభ్యంతరాలు లేకుండా బిడ్డర్ సాంకేతికంగా అర్హత సాధించినట్టు ప్రకటించించటం గమనార్హం. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద, ప్రాజెక్ట్‌పై మొత్తం వ్యయంలో 40 శాతం ఎన్‌హెచ్‌ఏఐ చెల్లించింది. మిగిలిన 60 శాతం రోడ్ డెవలపర్ ద్వారా సమకూరుతుంది. కాగ్ నివేదికలో ఉన్న ఆరోపణలను అదానీ గ్రూప్ అధికార ప్రతినిధి తోసిపుచ్చారు.

బిజెపి నేతకు సంబంధించిన కంపెనీ

2019, మార్చి 7న లక్నో రింగ్ రోడ్ ప్యాకేజీ 1 కోసం రూ. 904.31 కోట్ల అంచనా వ్యయంతో బిడ్‌లు జరిగాయి. విచిత్రమేమిటంటే, పీఎన్‌సీ ఇన్ఫోటెక్‌కు రూ. 1,062 కోట్లకు కాంట్రాక్టు లభించింది. ఇది అసలు అంచనా కంటే 17.44 శాతం ఎక్కువ. ఎన్‌హెచ్‌ఏఐ అసలు అంచనాలు 2016–17 షెడ్యూల్డ్ రేట్ల ఆధారంగా ఉన్నాయి. ప్రాజెక్ట్ అంచనా వ్యయం తదనంతరం 2019 రేట్ల ఆధారంగా సవరించబడింది. అయితే, కాగ్ నివేదికలో వివరించిన విధంగా, జైన్ కంపెనీ బిడ్ అంచనాలను 2.02 శాతం మించిపోయింది.

ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి బిజెపికి రూ.65 కోట్లు విరాళం


హాపూర్ బైపాస్–మొరాదాబాద్ హైవే ప్రాజెక్ట్ కోసం 68 శాతం తక్కువ ప్రీమియంతో ఎన్‌హెచ్‌ఏఐ కాంట్రాక్ట్‌ను గెలుచుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్.. 2013 నుంచి బీజేపీకి సుమారు రూ. 65 కోట్లు విరాళంగా అందించింది. 97.77 కోట్ల వార్షిక ప్రీమియం, 22 సంవత్సరాల రాయితీ వ్యవధితో ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ కోసం బిడ్లను ఆహ్వానించారు. అయితే, 2018 మార్చిలో, ప్రభుత్వ ఏజెన్సీ కేవలం రూ. 31.50 కోట్ల వార్షిక ప్రీమియంతో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిడ్‌ను ఆమోదించించటం గమనార్హం. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2020–21లో బిజెపికి రూ.20 కోట్లు విరాళంగా అందించగా, దాని సంబంధిత మూడు కంపెనీలు 2013 నుంచి 2021 మధ్య కాలంలో బిజెపికి దాదాపు రూ. 45 కోట్లు విరాళంగా అందించాయి.

జే కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ నుంచి కాషాయ పార్టీకి రూ.6.46 కోట్లు విరాళం

2018, డిసెంబర్ 2018లో జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ప్యాకేజీ 1 కోసం రూ. 1,349 కోట్ల కాంట్రాక్ట్‌ను గెలుచుకున్నది. ప్రతిపాదిత షరతు అభ్యర్థనను నెరవేర్చడంలో కంపెనీ విఫలమైనప్పటికీ ఇది జరిగిందని కాగ్ నివేదిక పేర్కొన్నది. 2013 నుంచి 2018 మధ్య, జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ బీజేపీకి దాదాపు రూ. 6.46 కోట్లు విరాళంగా అందించింది. 2017–18లో రూ.5.25 కోట్లు, 2015–16లో రూ.కోటి, 2013–14లో రూ.21 లక్షలు ఇచ్చింది. 2015 రోడ్డు స్కామ్‌కు సంబంధించి జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్‌ను 2016లో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ బ్లాక్‌లిస్ట్ చేసింది.

ఎంకెసి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లార్సెన్ అండ్ టూబ్రో ద్వారా విరాళాలు

ఢిల్లీ–వడోదర ఎక్స్‌ప్రెస్‌వేకి సంబంధించి చోటు చేసుకున్న అవకతవకలను కూడా కాగ్ ఎత్తి చూపింది. బిడ్‌లు తప్పుడు అంచనాల ఆధారంగా ఆహ్వానించబడ్డాయని వివరించింది. ఈ ప్రాజెక్టుతో సంబంధమున్న కంపెనీల నుంచి కూడా బీజేపీకి విరాళాలు అందాయి. 2014–15లో లార్సెన్ అండ్ టూబ్రో బీజేపీకి రూ. 5 కోట్లు విరాళంగా ఇచ్చిందని తేలింది. 2018 నుంచి 2020 మధ్యకాలంలో ఎంకేసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కాషాయ పార్టీకి రూ.75 లక్షలు విరాళంగా అందించింది. బీహార్‌లోని కిషన్‌గంజ్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన కూలిపోవడంతో జిఆర్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్ గతేడాది జూన్‌లో వెలుగులోకి వచ్చింది.



అక్సెల్సన్‌కు ప్రణయ్ ఝులక్

- **బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ సెమీస్‌కు**

కోపెన్‌హగాన్(డెన్మార్క్): బిడబ్ల్యుఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో టాప్‌సీడ్ అక్సెల్సన్‌కు హెచ్‌ఎస్ ప్రణయ్ ఝులక్ ఇచ్చాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ప్రణయ్ 13–21, 21–15, 21–16తో రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్ విక్టర్ అక్సెల్సన్‌ను ఓడించాడు. హోరాహోరీగా సాగిన క్వార్టర్స్‌లో ప్రణయ్ తొలిగేమ్‌ను అక్సెల్సన్ చేతిలో చిత్తుగా ఓడాడు. దీంతో తేరుకున్న ప్రణయ్ రెండో గేమ్‌ను 21–15తో గెలిచి 1–1 సెట్‌లతో సమంగా నిలిచారు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ప్రణయ్ తొలినుంచి దూకుడుగా ఆడి ఆ గేమ్‌ను చేజిక్కించుకొని తొలిసారి సెమీస్‌కు చేరాడు. సెమీస్‌కు చేరడం ద్వారా ప్రణయ్‌కు పతకం ఖాయమైంది. ఇక పురుషుల డబుల్స్‌లో చిరాగ్‌శెట్టి–సాత్విక్ సాయిరాజ్ జోడి నిరాశపరిచారు. క్వార్టర్స్‌లో వీరు 18–21, 19–21తో కిమ్ అస్ట్రప్–అండర్‌స్ట్రరఫ్(జపాన్) చేతిలో వరుససెట్లలో ఓడారు.

ఇంద్రపాలెం పోలీసుల దాష్టీకం

- **యువకుడ్ని మూడు వారాలుగా నిర్బంధించి చిత్రహింస**

ప్రజాశక్తి–కాకినాడ రూరల్

ఒక కేసులో మూడు వారాలుగా తూరంగికి చెందిన ఒక యువకుడిని ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి హింసిస్తున్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకుడు తల్లిదండ్రులు చెప్పిన వివరాల ప్రకారం కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన సన్నిబోయిన ప్రసాద్‌ను ఒక కేసులో మూడు వారాలుగా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్లో నిర్బందించారు. ఒక అమ్మాయితో బలవంతంగా పెళ్లి చేయాలని ఒత్తిడి చేసినా ప్రసాద్ ఒప్పుకోకపోవడంతో పోలీసులు శుక్రవారం పోలీస్ స్టేషన్లో నిర్బందించి చావగొడుతున్నారని ప్రసాదు తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తమ కుమారుడిని పోలీసులు చంపేస్తారని తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్యాయంగా తన కుమారుని మూడు వారాలుగా నిర్బంధించి, అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ తీవ్రంగా కొట్టడంతో ప్రసాద్ తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లడంతో గత మూడు వారాలుగా కేసు నమోదు చేయని పోలీసులు హడావిడిగా ఇప్పటికీ ఇప్పుడు కేసు నమోదు చేసే పనిలో ఉన్నారని తెలిపారు. ఈ విషయమై ఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన చేయడానికి ప్రసాద్ తల్లిదండ్రులు, బంధువులు సిద్ధమవుతున్నారు.

నారా లోకేష్‌పై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు

ప్రజాశక్తి-అనంతపురం

యువగళం పాదయాత్ర వేదికగా టిడిపి కార్యకర్తలను రెచ్చగొట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్న టిడిపి నేత నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంతపురం 2వ పట్టణం పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులుకు వైసిపి సోషల్ ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలవలేమని భావించిన టిడిపి నాయకులు నారాలోకేష్ ఎలాగైనా అధికారంలోకి రావాలని టీడీపీ కుట్రలు చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగమే మాచెర్ల, పుంగనూరు ఘటలు అని గుర్తు చేశారు. దీనికితోడు 'మీ మీద ఎన్ని ఎక్కువ కేసులు ఉంటే నామినేటెడ్ పదవులు ఇస్తాం' అని నారా లోకేష్ బహిరంగంగా మాట్లాడి దాడులకు ప్రేరేపించడమే అని తెలిపారు. ఎర్రపుస్తకం పేరుతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే నారా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ గోళ్ల శ్రావణ్‌రెడ్డి, ఐటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముకుందాపురం ప్రతాప్‌రెడ్డి, ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కో కన్వీనర్ నాని, ప్రతినిధుల సాయిప్రవల్లిక, జీఎస్.రాజు, జిలాన్, ప్రసాద్, నరేష్, నరసింహా, హరి, రమేష్, అమర్నాథ్ పాల్గొన్నారు. లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైసిపి సోషల్ మీడియా నాయకులు శుక్రవారం గుత్తిలో సీఐ ఎం.వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఎడారిగా.. తుంగభద్ర..!

- కరుణించని వరుణుడు
- ఎండిపోతున్న పంటలు
- రైతులకు కునుకు కరువు



ప్రజాశక్తి - కౌతాళం (కర్నూలు)

తుంగభద్ర నది వర్షాకాలంలో జలాలతో పరవళ్లు తొక్కుతూ పరుగులు తీయాల్సిన రోజులు. ప్రస్తుతం నీరు లేక రాజస్థాన్ ఎడారిలా దర్శనమిస్తోంది. కొనసీమను తలపించే తుంగభద్ర నదీతీర గ్రామాల పంట పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి. ఆనందంతో ఎరువులు వేయాల్సిన అన్నదాతల కళ్లల్లో కన్నీరు పారుతున్నాయి. వర్షాల్లేక సాగయిన పంటలు వాడిపోతున్నాయి. వ్యవసాయం కోసం రూ.వేలకు వేలు అప్పులు చేసి సాగు చేసిన అన్నదాతకు కంటి నిండా కునుకు లేకుండా ప్రకృతి కన్నెర్ర చేసింది. తుంగభద్ర నదీతీర రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది...

కర్నూలు జిల్లాలో తుంగభద్ర నది జలాలు ప్రవేశించే ప్రాంతం కౌతాళం మండలం మేళిగనూరు గ్రామం. ఈ నది ఈ గ్రామం నుంచి నదీచాగి, కుంభాలనూర్, కుంభాలనూరు క్యాంపు, మురళి, గుడికంబాళి ద్వారా ప్రవాహం కొనసాగుతుంది. ఈ ప్రాంత రైతులు వరి పంటను సాగు చేశారు. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు పంటలను సాగు చేశారు. తుంగభద్ర నదిలో నీరు లేకపోవడంతో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. అన్నదాత గుండె బాధతో బరువెక్కింది. వరుణుడైన కరుణిస్తాడా అనే బెంగతో ఎదురుచూస్తున్నారు. నెల రోజులవుతున్నా సరైన వర్షాలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బోర్ల కింద సాగు

ఈ ప్రాంతంలో కొంతమంది రైతులు వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగు చేశారు. ఈ రైతులకు విద్యుత్ కష్టాలు మొదలయ్యాయి. 9 గంటలు విద్యుత్ సరఫరా కావాల్సి ఉండగా కోతలతో రైతుకు కంటి నిండా నిద్ర లేకుండా చేస్తున్నారు. గంట గంటకు విద్యుత్ అంతరాయాలు ఏర్పడడంతో బోరు నీళ్లు ముందుకు వెళ్లక, భూమి తడవక, పంటలు ఎండిపోతున్నాయి. విద్యుత్ ఎప్పుడు వస్తుందో..? ఎంతసేపు వస్తుందో.. ఉంటుందో తెలియక అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రైతులను ఆదుకోవాలి:
తెలుగు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్

తుంగభద్ర నది కింద సాగు చేసిన రైతులను ఆదుకోవాలి. తుంగభద్ర జలాశయం నుంచి తుంగభద్ర నదికి నీటిని వదిలి పంటలను కాపాడాలి. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించకపోతే రైతులు ఆర్థికంగా నష్టపోయి అప్పులపాలవుతారు.

బెర్కాడియా సంస్థతో గీతం ఎంఒయు

ప్రజాశక్తి- మధురవాడ (విశాఖ)

అమెరికా, మెక్సికో, కెనడా, యూరప్, ఇంకా ఆసియా దేశాలలో అతి పెద్ద రియల్ ఎస్టేట్ ఫైనాన్స్ కంపెనీలలో ఒకటైన బెర్కాడియా సంస్థతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ మేరకు గీతం అకడమిక్ ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, బెర్కాడియా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ సుదీప్తో ముఖర్జి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న హిమాగ్నిరాజ్

ఉద్యోగ కల్పనలో బిజెపి విఫలం

ప్రభుత్వ శాఖల్లో ఏళ్ల తరబడి ఖాళీలు • డివైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమాగ్నిరాజ్ భట్టాచార్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని నిరుద్యోగం పెరుగుతున్నా ఉద్యోగాలు ఇవ్వడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయని డివైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమాగ్నిరాజ్ భట్టాచార్య అన్నారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం 'విద్య- ఉపాధి'పై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని నిరుద్యోగ యువతకు ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బిజెపి ప్రభుత్వం.. ఇచ్చిన హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. విదేశాల్లో ఉన్న నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికీ రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తామని ఒక్క రూపాయీ వెనక్కి తీసుకురాలేదని చెప్పారు. జిఎస్‌టి వల్ల ప్రజలపై భారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనాతో లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని చెప్పారు. దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు రగిల్చి రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం యువతకు ఉపయోగపడే ఏ పనీ చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఏండ్ల తరబడి ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. కేంద్రం విధానాలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయకపోతోందని, ప్రజలు ధరల భారంతో అవస్థలు పడుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వంతో యువతకు జరిగిన ఉపయోగం శూన్యమని, ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చి పేపర్ లీకేజీలతో సరిపుచ్చుకుందని విమర్శించారు. ఏ ఒక్క నోటిఫికేషన్ సక్రమంగా నిర్వహించలేకపోగా.. కోర్టు కేసులతో పెండింగ్‌లో పడిపోయాయని చెప్పారు. బిజెపి, బిఆర్ఎస్ విధానాలు ఒక్కటేనని, వాటిని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ఉపాధి కోసం జరుగుతున్న ఉద్యమంలో యువత భాగస్వామి కావాలని కోరారు. డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగాలు ఇవ్వని ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సదస్సుకు డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ అధ్యక్షతన వహించగా.. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి బషీర్, జి.తిరుపతి నాయక్, గడ్డం, రోషన్ బేగం, వెంకటేష్, సహాయ కార్యదర్శులు గొడిశాల కార్తీక్, జగన్, కొంటూ సాగర్, డి.సాంబమూర్తి, హనుమకొండ జిల్లా అధ్యక్షులు నోముల కిషోర్, కార్యదర్శి దొగ్గెల తిరుపతి, ఉపాధ్యక్షులు మంద సుచందర్, సహాయ కార్యదర్శులు మంద సురేష్ ఓర్సు చిరంజీవి, చిట్యాల విజయకుమార్ పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న అభ్యర్థులు

డిఎస్‌సి-98 అభ్యర్థుల భిక్షాటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

డిఎస్‌సి 98 క్వాలిఫైడ్ అభ్యర్థులు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో భిక్షాటన చేపడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బాధిత 98 డిఎస్‌సి పోస్టుల సాధన సమితి నాయకులు హైమావతి దేవి, తిరుమల నాయుడు, మల్లేష్ రమేష్‌లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ డిఎస్‌సి 98 అభ్యర్థులతో ఆటలాడడం తగదన్నారు. ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్న తమకు న్యాయం చేస్తానని చెప్పిన జగన్ మోహన్ రెడ్డి మాట తప్పారన్నారు. డిఎస్‌సి 98 క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని భవిష్యత్తులో మరింత ఉధృతంగా చేపడుతామని వారు హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బియ్యం ధరలు పైపైకి..!

- గతంతో పోలిస్తే 25 శాతం పెరుగుదల
- బస్తాపై రూ. 350 అదనం
- కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల
- ఉమ్మడి పశ్చిమలో తగ్గిన వినియోగం



ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

సామాన్య ప్రజానీకం గుండెల్లో బియ్యం ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఎన్నడూ లేని విధంగా ధరలు పెరగడంతో పేదలు బెంబేలెత్తిపోతున్నారు. గతంతో పోలిస్తే 25 శాతం బియ్యం ధరలు పెరిగాయి. బస్తాపై సుమారు రూ.350 అదనంగా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాణ్యత బట్టి కిలో రూ.60 నుంచి రూ.65కు ఎగబాకింది. అయితే దిగుబడి తగ్గడమే దీనికి కారణమని చెబుతున్నప్పటికీ సన్న రకం బియ్యం తినుబడి పెరగడంతో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయని రిటైల్ వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు తిప్పలు తప్పట్లేదు. ఒకప్పుడు సన్న రకం బియ్యాన్ని ఎగువ మధ్య తరగతి, సంపన్న వర్గాలే వినియోగించేవారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలూ మక్కువ చూపుతున్నారు. పౌర సరఫరాల ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం నాసిరకంగా ఉండడం ఎక్కువశాతం మంది సన్న బియ్యంపై మక్కువ చూపుతున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. మొన్నటి వరకూ 26 కిలోల బస్తా రూ.1,200 ఉంటే, ప్రస్తుతం రూ.1500లకు పెరిగింది. నాణ్యమైన బియ్యం 20కిలోల బస్తా రూ.1,600 పలుకుతోంది. అంటే అతికొద్ది రోజుల వ్యవధిలోనే 25 శాతం మేర ధరలు పెరిగాయి.

సామాన్య, మధ్య తరగతి ప్రజల నెలవారీ బడ్జెట్‌ను పెంచాయి. దీంతో ఆయా వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఐదేళ్లలో ఉమ్మడి పశ్చిమలో బియ్యం వినియోగం గణనీయంగా తగ్గింది. 2018 అమ్మకాలతో పోలిస్తే ఇప్పుడు అమ్మకాలు సుమారు 25 శాతం తగ్గాయి. దీనికి ప్రధాన కారణం ప్రజల్లో ఆహార నియమాలు పెరగడం, సాయంత్రం పూట అధిక జనాభా అల్పాహారంతో సరిపెట్టడంతో బియ్యం వినియోగం తగ్గింది. అయినప్పటికీ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో పండిస్తున్న వరి పంట ఇక్కడ వినియోగిచడం లేదు. ఎదుకంటే ఇక్కడ ముతకరం బియ్యం ఉత్పత్తి అవుతాయి. ముతక బియ్యం ఉత్తరాది రాష్ట్రాలకు ఎగు మతవుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు లెవీ తీసుకుని రేషన్ డిపోల ద్వారా పేదలకందిస్తున్న ముతక బియ్యం కొంతభాగం మరలా రీ సైక్లింగ్ అవుతుంటే కొంత భాగం రొయ్యలు, చేపల చెరువులకు, పశువుల దాణాగా వినియోగిస్తున్నారు. స్థానికంగా పండే వరి పంట ద్వారా వచ్చే బియ్యం స్థానిక అవసరాల్లో పదిశాతం మించి వినియోగం కావడం లేదు. మిగిలిన 9 శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతైన సన్న బియ్యాన్నే ఉమ్మడి జిల్లాలో వినియోగిస్తున్నారు.

మూడు నెలల్లో రూ. 350 పెరుగుదల

ఈ ఏడాది మార్చిలో 25 కేజీల బియ్యం బస్తా రూ.1,200 ఉంది. ఏప్రిల్‌లో రూ.1,450, ఆగస్టులో రూ.1,500 దాటి విక్రయిస్తున్నారు. మూడు నెలల కాలంలో బియ్యం బస్తాపై రూ.350 పెరిగింది. కర్నూల్ సోనామసూరి బియ్యం వంద కిలోలు రూ.6,800 పలుకుతున్నాయి. వ్యాపారులు, మిల్లర్లు పెద్ద ఎత్తున ధాన్యాన్ని నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టించి ధర పెంచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. బిపిటి 76 కిలోల ధాన్యం బస్తా ఏప్రిల్‌లో రూ.2,350 నుంచి రూ.2,500 పలికింది. ప్రస్తుతం రూ.2,850 నుంచి రూ.మూడు వేల పలుకుతున్న పరిస్థితి.

కేంద్రం నిర్ణయంతో ధరలు పెరుగుదల

పన్నుల ఉపశమనం పొందడానికి 26 కిలోలు, 30 కిలోల బస్తాలను అందుబాటులోకి తెచ్చాయి. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం 25 కేజీల వరకూ బ్రాండ్లతో అమ్ముతున్న బియ్యానికి పన్ను వసూలు చేస్తున్నారు. 26 కిలోలు దాటితే పన్ను ఉండదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు 26 కేజీల బస్తాలను విక్రయిస్తున్నారు. 26 కిలోల సన్న బియ్యం బస్తా ఏప్రిల్‌లో రూ.1400 ఉంది. డీమార్ట్‌లో రూ.1750 పలుకుతోంది. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడం వల్ల ధాన్యం దెబ్బతిందని, నిల్వలు లేవని వ్యాపారులు చెబుతున్నారు. పదేళ్లలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయి ధరలు పెరిగాయి.

రేషన్ బియ్యం తినేందుకు విముఖత..

పౌర సరఫరా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పేద ప్రజానీకం తింటున్నప్పటికీ ఎక్కువ శాతం విముఖత చూపుతున్నారు. ఇవి తినడం వల్ల రకరకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని రేషన్ లబ్ధిదారులు చెబుతుండంతో తినుబడి తగ్గుతున్న పరిస్థితి. విచిత్రం ఏంటంటే కిలో రూపాయి బియ్యం కొనుక్కున్న పౌరులు సైతం కోటా బియ్యాన్ని రిటైల్ దుకాణాల్లో మార్పిడి చేసుకుంటున్న పరిస్థితి. కోటా బియ్యం బ్లాక్ మార్కెట్లో కిలో రూ.12లకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం 50 శాతం మరలా రిటైల్ బియ్యం వర్తకుల ద్వారా రైస్ మిల్లులకు చేరి కొత్త సంచుల్లో ప్యాకింగ్ చేసి మరలా ప్రభుత్వ చౌకధరల దుకాణాలకు వస్తున్నాయి. ఈ విధానంలో దళారులకు కిలోకు ఖర్చులు పోనూ ఎనిమిది రూపాయలు మిగులుతున్నట్లు చెబుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో కోటా బియాన్ని మార్పిడి చేసుకోవడం లేదా అమ్మకాలు జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో కోటా బియ్యాన్ని పశువులకు, చేపల, రొయ్యల చెరువుల్లో మేతగా వినియోగిస్తున్న పరిస్థితి ఉంది.

ప్రమాదం మాటను ఆరోగ్యం

పాలిష్ పట్టిన బియ్యం, సన్నరకాల బియ్యంలో చెక్కర శాతం ఎక్కువుగా ఉంటుందని, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఆ బియ్యం తినడం వల్ల మరింతగా ఆరోగ్య సమస్యలు ఎదువురతాయని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ వాటివైపే ఎక్కువ మక్కువ చూపుతున్నారు. పట్టు తక్కువ బియ్యం, బ్రౌన్ రైస్, ముతక బియ్యం, రంగుమారిన బియ్యం, దంపుడు బియ్యం తినడం ద్వారా మధుమేహం కొంతమేరకు అదుపు అయ్యే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

రేషన్ బియ్యంలో పోషక విలువలు

రేషన్ బియ్యంలో పోషక విలువలు దాగి ఉన్నాయని జిల్లా అధికార యంత్రాంగం ఇటీవల పెద్ద ఎత్తున అవగాహన కల్పించింది. ఆగస్టు 8వ తేదీన డిఆర్‌డిఎ, మెప్మా, సిడిఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో రేషన్ బియ్యంతో 108 వంటకాలు తయారీ పోటీలను ఏర్పాటు చేసి అవగాహన చేపట్టింది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి సంయుక్తంగా వంటకాల పోటీలను పరిశీలించి రుచి చూశారు. రేషన్ బియ్యాన్ని తక్కువగా భావించడం సరికాదని, ప్రస్తుతం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యంలో పోషక విలువలతో కూడిన ఫోర్టిఫైడ్ కెర్నల్స్‌ను కలపడం ద్వారా ఈ బియ్యం వినియోగించే లబ్ధిదారులకు ఐరన్, విటమిన్ బి12, పోలిక్ యాసిడ్ సంపూర్ణంగా అందుతాయని అవగాహన కల్పించారు.

856.20 అడుగులకు శ్రీశైలం జలాశయం నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగుల నీటి నిలువ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా శుక్రవారం సాయంత్రం మూడు గంటల సమయానికి నీటి మట్టం 856.20 అడుగులుగా ఉంది. గత కొద్ది రోజులుగా ఎగువ ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి పూర్తిస్థాయిలో వరద నీటి ప్రవాహం నిలిచి పోయినప్పటికీ రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 7000 క్యూసె క్కులు, హంద్రీనీవా సుజలా స్రవంతికి 1898 క్యూసెక్కులు, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 2,400 క్యూసెక్కులు, ముచ్చుమర్రికి 490 క్యూసెక్కులు తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్తు ఉత్పత్తి వినియోగానికి 7000 క్యూసెక్కులు అలాగే జలాశయంలో ఆవిరి అయిన నీరు 320 క్యూసెక్కుల తో కలిపి మొత్తము 19,108 క్యూసెక్కుల నీరు బ్యాక్ వాటర్ విడుదల అవుతుంది. గడచిన 24 గంటలలో ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.2 08 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు. అదే సమయానికి ప్రస్తుతం జలాశయం నందు నీటి నిలువ సామర్థ్యం 95.13 68 టీఎంసీలుగా నీరు నిలువగా ఉంది. అలాగే గతంలో ఇదే సమయానికి జలాశయం పూర్తిస్థాయిలో నిండుగా ఉండి రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా దిగువ సాగరకు నీటిని విడుదల చేశారు.

రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తా..

- పంజాబ్ సిఎంకు ఆ రాష్ట్ర గవర్నర్ బెదిరింపు

చండీగఢ్: పంజాబ్ గవర్నర్ బన్వారిలాల్ పురోహిత్, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మధ్య వివాదం శుక్రవారం తీవ్రస్థాయికి చేరింది. ఏకంగా పంజాబ్‌లో రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తానని ముఖ్యమంత్రిని గవర్నర్ బెదిరించారు. గతంలో తాను రాసిన లేఖలకు సమాధానం ఇవ్వకపోతే రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేస్తానని.. క్రిమినల్ చర్యలకు ఉపక్రమిస్తానంటూ హెచ్చరించారు. ఈ మేరకు మాన్‌కు పంపిన లేఖను గవర్నర్ శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. గతంలో రాసిన లేఖలపై ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంపై కలత చెందినట్టు పేర్కొన్నారు. రాజ్యాంగ యంత్రాంగం వైఫల్యంపై రాష్ట్రపతికి నివేదించగలనంటూ హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 356, ఐపిసి సెక్షన్ 124 ప్రకారం తాను 'తుది నిర్ణయం' తీసుకోవడానికి ముందే చర్యలు తీసుకోవాలని మాన్‌కు సూచించారు. అలాగే, రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలపైనా సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ ఇవ్వకపోతే రాజ్యాంగం, చట్టపరంగా చర్యలు తీసుకోవడం తప్ప తనకు వేరే మార్గం ఉండదన్నారు.

రాష్ట్రంలోని ఆప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశ్నిస్తూ గవర్నర్ ముఖ్యమంత్రికి పలుమార్లు లేఖలు రాశారు. ఫిబ్రవరిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రిన్సిపాళ్లను సింగపూర్ పర్యటనకు ఎంపిక చేయడం సహా పలు అంశాలపై గవర్నర్ వివరాలు కోరారు. ఇలాంటి అంశాల విషయంలో ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య దూరం పెరుగుతూ వచ్చింది.

ఐఐటి బాంబేకు రూ.160 కోట్ల భారీ విరాళం

ముంబై : దేశంలోనే పేరొందిన ఐఐటీ బాంబేకు పూర్వ విద్యార్థి ఒకరు భారీ మొత్తాన్ని విరాళంగా అందించారు. రూ.160 కోట్లకు చెక్ రాసి పంపించాడని ఐఐటీ బాంబే డైరెక్టర్ ప్రొఫెసర్ సుభాసిస్ చౌదరి తెలిపారు. తన పేరు వెల్లడించవద్దని దాత కోరడంతో వివరాలను గోప్యంగా ఉంచాల్సి వస్తోందన్నారు. ఈ మొత్తాన్ని గ్రీన్ ఎనర్జీ అండ్ సస్టైనబిలిటీ రీసెర్చ్ హబ్ ఏర్పాటుకు వెచ్చిస్తామని వివరించారు. కాగా, ఇంత పెద్ద మొత్తంలో విరాళం అందించి కూడా ప్రచారం కోరుకోకపోవడం దాతకున్న గొప్ప మనసును చాటుతోందని ప్రశంసించారు.

మోడీ డిగ్రీ కేసు

- కేజ్రీవాల్‌కు దక్కని ఉపశమనం

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి మోడీ డిగ్రీ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించలేదు. ఈ కేసులో తనపై చర్యలు తీసుకోకుండా విచారణపై స్టే విధించాలని కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలు తమ విశ్వవిద్యాలయానికి పరువునష్టం కలిగించాయని గుజరాత్ యూనివర్సిటీ ఈ కేసు వేసింది. ఈ కేసుకు సంబంధించిన విచారణ ప్రస్తుతం గుజరాత్ హైకోర్టులో పెండింగ్ ఉందని, అందువల్ల తాము ఎలాంటి నోటీసులు జారీ చేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనిపై కేజ్రీవాల్, గుజరాత్ యూనివర్సిటీ తమ విజ్ఞప్తులను హైకోర్టుకు సమర్పించుకోవచ్చని సూచించింది. ఈ పరువు నష్టం కేసులో విచారణ నిమిత్తం గుజరాత్ మెట్రోపాలిటన్ కోర్టుకు రావాలని కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. ఈ సమన్లను సెషన్స్ కోర్టులో కేజ్రీవాల్ సవాల్ చేశారు. కేజ్రీవాల్ సవాల్‌ను సెషన్స్ కోర్టు తిరస్కరించడంతో ఇటీవల ఆయన గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, స్టే ఇచ్చేందుకు గుజరాత్ కోర్టు కూడా నిరాకరించింది. దీంతో సుప్రీంకోర్టును కేజ్రీవాల్ ఆశ్రయించారు.

కాగా, ప్రధాని మోడీ తన డిగ్రీ సర్టిఫికెట్ చూపించాల్సిన అవసరం లేదని గుజరాత్ హైకోర్టు ఈ ఏడాది మార్చిలో తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే కేజ్రీవాల్ వ్యాఖ్యలపై గుజరాత్ వర్సిటీ పరువు నష్టం దావా వేసింది.

జి-20 సమ్మిట్‌కు పుతిన్ హాజరుకావడం లేదు

- రష్యా వెల్లడి

మాస్కో : భారత్‌లో జరగనున్న జి-20 సమ్మిట్‌కు రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ వ్యక్తిగతంగా హాజరుకావడం లేదు. అయితే ఈ సదస్సులో వర్చువల్‌గా ఆయన పాల్గొంటారని తెలుస్తున్నది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. జి-20 సమ్మిట్‌కు పుతిన్ స్వయంగా హాజరయ్యే ప్రణాళికలు ఏమీ లేవని తెలిపారు. వర్చువల్‌గా ఈ సదస్సులో పాల్గొనడాన్ని తర్వాత నిర్ణయిస్తామని అన్నారు. సెప్టెంబరు 9 నుంచి 10 వరకు ఢిల్లీలో జి-20 సమ్మిట్ జరగనున్నది. అమెరికా అధ్యక్షులు జో బైడెన్ సహా పలు దేశాధినేతలు ఈ సదస్సుకు హాజరవ్వనున్నారు. అయితే రష్యా అధ్యక్షులు పుతిన్ మాత్రం వ్యక్తిగతంగా హాజరుకావడం లేదని ఆ దేశం స్పష్టం చేసింది. ఉక్రెయిన్‌పై సంక్షోభం నేపథ్యంలో పుతిన్‌పై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) అరెస్టు కోసం వారెంట్ జారీ చేసింది. ఈ కారణంతోనే పుతిన్ విదేశాల్లో ప్రయాణించడం లేదని కొంత మంది ఆరోపిస్తున్నారు. తాజాగా దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సుకు కూడా పుతిన్ హాజరుకాలేదు. అయితే వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు.

ఆ మరమ్మతులకు అనుమతుల్లేవ్ !


సిగ్నల్ ఇన్‌ఛార్జ్ ఎకె మహంత్‌కు బెయిల్ ఇవ్వద్దు • ఒడిషా రైలు ప్రమాదంపై సిబిఐ



భువనేశ్వర్ : జూన్‌లో సంభవించిన ఒడిషాలో మూడు రైళ్ల ప్రమాదానికి 'అనుమతులు లేకుండా చేసిన మరమ్మత్తులే' కారణమని సిబిఐ వెల్లడించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లోని ప్రత్యేక న్యాయస్థానానికి సిబిఐ వివరించింది. సీనియర్ సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్ ఇన్‌ఛార్జి) అరుణ్ కుమార్ మహంత.. ఉన్నతాధికారుల నుంచి సరైన అనుమతులు తీసుకోకుండా క్షేత్ర స్థాయిలో మరమ్మతులు చేయించారని తెలిపింది. ఈ రైలు ప్రమాదానికి సంబంధించిన కేసులో సిబిఐ అరెస్టు చేసిన ముగ్గురిలో ఒకరైన అరుణ్ కుమార్ మహంత తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ దాఖలు చేసిని పిటీషన్ విచారణ భువనేశ్వర్‌లోని సిబిఐ కోర్టులో శుక్రవారం జరిగింది. మహంత బెయిల్ పిటీషన్‌ను సిబిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. బహానగా బజార్ స్టేషన్ సమీపంలో ప్రమాదం జరిగిన 94వ క్రాసింగ్ లెవెల్ గేట్ వద్ద మరమ్మత్తు పనులు మహంత సమక్షంలోనే జరిగాయని కోర్టుకు సిబిఐ వివరించింది. ఈ మరమ్మత్తు పనులు కోసం సీనియర్ డివిజినల్ ఇంజినీర్ (సిగ్నల్ అండ్ టెలికం) నుంచి అనుమతులు గానీ, సర్క్యూట్ చిత్రంగానీ తీసుకోలేదని సిబిఐ ఆరోపించింది. గేట్ నెంబరు 79 వద్ద మరమ్మతులకు ఉపయోగించిన సర్క్యూట్ చిత్రం ఆధారంగానే ఇక్కడ మరమ్మతులు చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని వివరించింది. పనులు జరుగుతున్నప్పుడు మహంత అక్కడే ఉన్నారని, ఆయన ఆధ్వర్యంలోనే మరమ్మత్తులు చేపట్టారని, అందువల్ల ఆయనకు బెయిల్ మంజూరు చేయొద్దని కోర్టుకు సిబిఐ విజ్ఞప్తి చేసింది. అయితే మహంత తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రమాదానికి కారణంగా భావిస్తున్న లెవెల్ క్రాసింగ్ గేట్ గత కొంత కాలంగా సరిగా పని చేయడం లేదని, ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని కోర్టుకు తెలిపారు. పర్యవేక్షణ పనిని ఇతర వ్యక్తులకు అప్పగించారని, అందువల్ల ప్రమాదానికి మహంత బాధ్యుడు కాదని వాదన వినిపించారు. వాదనలు విన్న న్యాయస్థానం మహంతకు బెయిల్ నిరాకరించింది. సిగ్నల్, ఇంటర్‌లాకింగ్ ఇన్‌స్టాలేషన్లను పరీక్షించడం, సరిదిద్దడం, మార్పులు చేయడం పిటిషనర్ (మహంత) విధుల్లో భాగమని పేర్కొంది. ఉన్నతాధికారులు ఆమోదించిన సూచనలకు అనుగుణంగా అతడు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉండేదని అభిప్రాయపడింది. అందులో విఫలమైనందువల్లే.. 296 మందికి పైగా ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని తెలిపింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం..ఈ ప్రమాదానికి మహంతానే ప్రధాన కారకుడని కోర్టు భావిస్తోందని పేర్కొంది.

జూన్ 2న ఒడిషాలోని బాలేశ్వర్ సమీపంలో బహానగా బజార్ స్టేషన్ వద్ద జరిగిన ఘోర రైలు ప్రమాదంలో 296 మంది ప్రాణాలు కోల్పోగా, వెయ్యి మందికిపైగా క్షతగాత్రులైన సంగతి తెలిసిందే. షాలీమార్-చెన్నై కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు మెయిన్‌లైన్‌లోకి వెళ్లడానికి సిబ్బంది గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి, వెనక్కి తీసుకున్నారు. దీంతో ఆ రైలు లూప్‌లైన్లోకి వెళ్లి అప్పటికే అక్కడ ఆగి ఉన్న గూడ్సురైలును ఢీకొట్టింది. ఆ తీవ్రతకు కోరమాండల్‌లోని కొన్ని బోగీలు ఎగిరి, పక్కనున్న ట్రాకుపై పడ్డాయి. అదే సమయంలో ఆ మార్గంలో దూసుకువస్తున్న బెంగళూరు-హావ్‌డా సూపర్‌ఫాస్ట్ రైలు వాటిని ఢీకొట్టి పట్టాలు తప్పింది. ఇదంతా క్షణాల్లో జరిగిపోవడంతో పెను విషాదం చోటుచేసుకుంది.

ఈ కేసును కేంద్ర ప్రభుత్వం సిఫారసు మేరకు సిబిఐ విచారిస్తుంది, ముగ్గురిన్ని అరెస్టు చేసింది. అరెస్టయిన వారిలో సెక్షన్ ఇంజినీర్ (సిగ్నల్) అరుణ్ కుమార్ మహంత, సెక్షన్ ఇంజినీర్ మొహమ్మద్ ఆమిర్ ఖాన్, టెక్నిషియన్ పప్పు కుమార్‌లు ఉన్నారు.



8 మీటర్లు ప్రయాణించిన ప్రజ్ఞాన్

బెంగళూరు: ప్రజ్ఞాన్ రోవర్ చంద్రుడి ఉపరితలంపై 8 మీటర్లు సురక్షితంగా ప్రయాణం చేసింది. ఈ విషయాన్ని ఇస్రో శుక్రవారం వెల్లడించింది. చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా దిగిన తర్వాత కూడా చంద్రయాన్-3కు సంబంధించిన వివరాలను ఇస్రో ఎప్పటికప్పుడు వెల్లడిస్తుంది. శుక్రవారం సాయంత్రం 'చంద్రుడిపై ప్రజ్ఞాన్ రోవర్ 8 మీటర్ల దూరాన్ని విజయవంతంగా ప్రయాణం చేసింది' అని ఇస్రో తెలిపింది. రోవర్ పేలోడ్స్ ఎల్ఐబిఎస్, ఎపిఎక్స్ఎస్ ఆన్ అయ్యాయని తెలిపింది. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా విడుదల చేసింది. 30 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియోను విక్రమ్ ల్యాండర్ చిత్రీకరించింది. కాగా, శుక్రవారం ఉదయం లాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ బయటికొస్తున్న వీడియోను ఇస్రో విడుదల చేసింది. ఇందులో రోవర్ బయటికి వచ్చే ముందు ల్యాండర్‌లోని ర్యాంప్ ఎలా తెరుచుకుందో మనం చూడొచ్చు. 'సోలార్ ప్యానెల్ అమర్చిన రోవర్ ల్యాండర్ నుంచి బయటికి వచ్చేందుకు రెండు విభాగాలుగా ఉన్న ర్యాంప్ సాయపడింది. రోవర్ బయటికి రావడానికి ముందు ర్యాంప్, సోలార్ ప్యానెల్ తెరుచుకున్న విధానం చూడొచ్చు. దీని కోసం చంద్రయాన్-3 మిషన్‌లో 26 యంత్రాలను ఉపయోగించాం. ఇవి బెంగళూరులోని యూ ఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో అభివృద్ధి చేశారు' అని ఇస్రో ట్వీట్ చేసింది.

నిఖా హలాలా, ముతాహ్‌పై మీ వైఖరి చెప్పండి

- ముస్లిం బోర్డును కోరిన లా కమిషన్

న్యూఢిల్లీ : వివాహానికి సంబంధించిన రెండు రూపాలైన నిఖా హలాలా, ముతాహ్‌పై వైఖరిని తెలియచేయాలని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి)ను లా కమిషన్ కోరింది. అలాగే వివాహానికి కనీస వయస్సు గురించి ఇస్లామిక్ చట్టంలో ఉన్న వివరణను కూడా కమిషన్ కోరింది. ఈ మేరకు ఎఐఎంపిఎల్‌బి అధ్యక్షులు మౌలానా ఖలీద్ సైపుల్లా రెహ్మానీ నేతృత్వంలోని 11 మంది సభ్యుల ప్రతినిధి బృందంతో లా కమిషన్ చైర్మన్ జస్టిస్ (రిటైర్డ్) రీతు రాజ్ అవస్తీ రెండు గంటలపాటు సుదీర్ఘంగా సమావేశమయ్యారు.

నిఖా హలాలా, ముతాహ్‌కు వ్యతిరేకంగా పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు రకాల వివాహాలపై నిషేధం విధించాలని పిటీషనర్లు కోరుతున్నారు. లా కమిషన్‌తో సమావేశం గురించి ఎఐఎంపిఎల్‌బి ప్రతినిధుల బృందం మీడియాతో మాట్లాడింది. లా కమిషన్ పేర్కొన్న రెండు వివాహ విధానాలు ప్రస్తుతం దేశంలో పెద్దగా ఆచరణలో లేవని తెలిపారు.

జపాన్ అణు డంపింగ్‌పై

అంతర్జాతీయ సమాజం ఆగ్రహం

టోక్యో: జపాన్ గురువారం నుంచి పసిఫిక్ సముద్రంలోకి అణు కలుషిత వ్యర్థ జలాలను విడుదల జేయడంపై అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జపాన్ నిర్లక్ష్యపు చర్యలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఆ దేశం నుంచి సముద్ర చేపల ఉత్పత్తులను దిగుమతి చేసుకోరాదని చైనా, ఆస్ట్రేలియా, ఫిలిప్పైన్స్ తదితర దేశాలు ఇప్పటికే నిర్ణయించాయి. ఇతర ఆహార ఉత్పత్తులు, పిల్లల ఆహారోత్పత్తులు ఇప్పటికే బుక్ చేసిన వాటిని రద్దు చేసుకుంటున్నట్లు వివిధ సంస్థలు ప్రకటించాయి. విదేశాల నుంచే కాదు, ఈ అణు కలుషిత వ్యర్థాల విడుదలపై స్థానిక ప్రజల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఎక్కడికక్కడ ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తున్నారు. దీంతో జపాన్ ఆర్థికంగా నష్టపోవడమే గాక, రాజకీయ ప్రతిష్ట కూడా దెబ్బతింటోందని పలువురు పరిశీలకులు పేర్కొంటున్నారు. జపాన్ మిత్ర దేశాలైన అమెరికా, బ్రిటన్ మౌనం వహించాయి. పరిమితి మేరకే అణు కలుషిత వ్యర్థ జలాలను సముద్రంలోకి విడుదలజేస్తున్నట్లు నమ్మబలికే యత్నం చేస్తున్నాయి. జపాన్ అక్వాటిక్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం విధించిన చైనా తాజాగా సౌందర్య సాధనాలపైన, తల్లి బిడ్డలకు వాడే ఉత్పత్తులపైన ఆంక్షలు పెట్టింది. జపాన్ అత్యంత నిర్లక్ష్యపూరితంగా, బాధ్యతారహితంగా అణు వ్యర్థాలను విడుదల జేయడం వల్ల సముద్ర పర్యావరణం, ఆహార భద్రత ప్రమాదంలో పడతాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ చెప్పారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే జపాన్‌కు ఇది పెద్ద అవమానంగా మిగిలిపోతుందని ఆయన అన్నారు. దక్షిణ కొరియా ప్రభుత్వం మౌనం వహించినా, అక్కడి ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ మాత్రం జపాన్ చర్యను తీవ్రంగా విమర్శించింది. డెమొక్రటిక్ పార్టీ నాయకుడు లీ జె మ్యూంగ్, జపాన్ పర్యావరణ యుద్ధ నేరగాళ్ల మార్గాన్ని అనుసరిస్తున్నదని అన్నారు. లీ ఇంతకుముందు ఈ డంపింగ్‌ను 'రెండవ పసిఫిక్ యుద్ధం' అని పిలిచారు. గతంలో పొరుగు దేశాలపై దాడి చేసిన జపాన్ , పసిఫిక్ ప్రాంతంలో ఉన్న దేశాలకు మరో కోలుకోలేని విపత్తును తలపెట్టిందని విమర్శించారు. సియోల్‌లోని జపనీస్ దౌత్య కార్యాలయం ఎదుట డెమొక్రటిక్ పార్టీ నిరసన తెలియజేసింది. దక్షిణ కొరియాలో 80 శాతం మంది జపాన్ డంపింగ్‌ను వ్యతిరేకిస్తున్నారు. సీఫుడ్స్ తినకూడదని భావిస్తున్నట్లు ఓ సర్వే వెల్లడించింది. ఫిలిప్పైన్స్ మత్స్యకారుల సంఘాలు జపాన్ చర్యను తీవ్రంగా విమర్శించాయి. ఈశాన్య రుతుపవనాల ప్రారంభంతో అణుధార్మిక కలుషిత జలాలు పసిఫిక్ మహా సముద్ర పశ్చిమ భాగానికి చేరుకోవచ్చుని, ఫిలిప్పైన్స్ సముద్ర తీర జలాలు కూడా కలుషితమయ్యే ప్రమాదముందని ఆ సంఘాలు పేర్కొన్నాయి.

ఈ అణు కలుషిత మురుగు నీటి వల్ల కలిగే హాని అనేక రూపాల్లో ఉంటుందని, దీని దుష్ప్రభావాలు త్వరలోనే స్పష్టంగా బయటపడతాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అణు వ్యర్థాలకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేస్తాం

- గ్రీస్‌లో మోడీ ఒక రోజు పర్యటన

ఏథెన్స్: భారత్- గ్రీస్ దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. ఒక రోజు పర్యటన కోసం గ్రీస్ ఏథెన్స్‌కు మోడీ శుక్రవారం చేరుకున్నారు. బ్రిక్స్ సమావేశాల కోసం దక్షిణాఫ్రికా వెళ్లిన మోడీ అక్కడ నుంచి నేరుగా ఏథెన్స్‌కు వెళ్లారు. ఆ దేశ విదేశాంగ మంత్రి జార్జ్ గెరాపెట్రైటిస్ మోడీకి స్వాగతం పలికారు. గ్రీస్‌లో భారత ప్రధాని పర్యటించడం 40 ఏళ్లలో ఇదే మొదటిసారి. శుక్రవారం గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సాంకేతికత, మౌలిక సదుపాయాలు, విద్య, డిజిటల్ చెల్లింపులు, ఫార్మా, పర్యాటకం, వ్యవసాయం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించినట్లు చెప్పారు. 'ఇరుదేశాల మధ్య రక్షణ పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు అంగీకరించాం. జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో చర్చల వ్యవస్థ ఏర్పాటుకు ముందుకొచ్చాం. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంపైనా దృష్టి సారించాం. భారత్-గ్రీస్ మధ్య నైపుణ్య వలసలను సులభతరం చేసేందుకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించాం' అని మోడీ తెలిపారు. గ్రీస్ ప్రధానమంత్రి కిరియాకోస్ మిత్సోటాకిస్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా భారత్‌తో తమ సంబంధాలు చాలా మెరుగుపడ్డాయని.. రెండు దేశాల మధ్య ఆర్థిక, రక్షణ, పర్యాటక రంగాల్లో విస్తృత సహకారానికి అవకాశం ఉందని అన్నారు.

ఈ సమావేశానికి ముందు గ్రీస్ అధ్యక్షురాలు కాథెరినా ఎన్ సకెల్లారోపౌలౌతో మోడీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మోడీకి గ్రీక్‌లో రెండో అత్యుతున్నత పౌర పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ హనర్' ప్రదానం చేశారు.

బ్రిక్స్ అధినేతలకు మోడీ బహుమతులు

జొహన్నెస్‌బర్గ్ : బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న దేశాల నేతలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అత్యంత ఆకర్షణీయమైన బహుమతులను ఇచ్చారు. భారత దేశ సంస్కృతి వారసత్వాల ఔన్నత్యాన్ని ఈ బహుమతులు ప్రతిబింబిస్తున్నాయి. వీటిలో తెలంగాణలో ప్రసిద్ధి పొందిన సురహి కూడా ఉంది. తెలంగాణకు చెందిన సురహి (పొడవైన మెడ ఉండే కూజా)ల జతను దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసాకు మోడీ ఇచ్చారు. ఆయన సతీమణి త్షెపో మొట్సెపేకి నాగాలాండ్‌లో తయారైన శాలువను బహూకరించారు. నాగాలాండ్ శాలువలకు శతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడి గిరిజనులు ఈ శాలువలను తయారు చేస్తారు. అద్భుతమైన వస్త్ర కళా నైపుణ్యం దీనిలో కనిపిస్తుంది. అలాగే బ్రెజిల్ అధ్యక్షులు లూయిజ్ ఇనాసియో లుల డా సిల్వకు మధ్య ప్రదేశ్‌లో తయారైన గోండ్ పెయింటింగ్‌ను మోడీ బహూకరించారు. గిరిజన కళారూపాల్లో గోండ్ చిత్రకళ ఒకటి. గోండ్ అంటే పచ్చని పర్వతం అని అర్థం. స్థానికంగా దొరికే సహజసిద్ధమైన రంగులు, చార్‌కోల్, రంగు మట్టి, ఆకులు, ఆవు పేడ, లైమ్‌స్టోన్ పౌడర్ వంటివాటితో ఈ చిత్రాలను రూపొందిస్తారు.



పాఠశాలల్లో అల్పాహారం : స్టాలిన్

- దేశంలోనే తొలిసారి

నాగపట్టణం: రాష్ట్రంలోని పాఠశాలల్లోనే పిల్లలకు ఉచితంగా అల్పాహారం అందించేందుకు ఉద్దేశించిన 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'ను తమిళనాడు సీఎం స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం ద్వారా తమిళనాడు రాష్ట్ర ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు ఉదయం పూట అల్పాహారం అందించనున్నారు. దీంతో దేశంలోనే పాఠశాలల్లో అల్పాహారం అందిస్తున్న తొలి రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. నాగపట్టణం జిల్లాలోని తిరుక్కువళై ప్రాథమిక పాఠశాలలో ఈ స్కీం రెండో విడతను ప్రారంభించిన సీఎం స్టాలిన్.. చిన్నారులకు అందించే అల్పాహారాన్ని దగ్గరుండి పరిశీలించారు. అనంతరం పిల్లలకు స్వయంగా వడ్డించిన ముఖ్యమంత్రి.. తాను కూడా చిన్నారులతో కలిసి అల్పాహారం తిన్నారు. చెన్నైలో స్టాలిన్ కుమారుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి ఈ పథకాన్ని ప్రారంభించారు. వాస్తవానికి ఈ పథకాన్ని గతేడాది సెప్టెంబరులోనే ప్రకటించిన స్టాలిన్ సర్కారు.. ప్రయోగాత్మకంగా 1545 పాఠశాలల్లో ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ పథకం విజయవంతమవడంతో ఇప్పుడు శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 31,008 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు దీన్ని విస్తరించారు.

ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లపై స్పందించండి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతిస్పందనలను కోరింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16 (ప్రభుత్వ ఉద్యోగ విషయాల్లో సమానత్వం) ప్రకారం ట్రాన్స్‌జెండర్లు రిజర్వేషన్‌కు అర్హులని నొక్కిచెప్పిన పిటిషన్‌పై సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యుఎన్‌డిపి) సహకారంతో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) నివేదికపై కేరళకు చెందిన సుబి కెసి అనే ట్రాన్స్‌జెండర్ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారణ జరిపింది. ట్రాన్స్‌జెండర్లకు (లింగ మార్పిడి వ్యక్తులకు) తగినంత శిక్షణ, ఉపాధి నైపుణ్య కార్యక్రమాలు లేకపోవడం వల్ల ఈ అట్టడుగు వర్గానికి ఉపాధి అవకాశాలు గణనీయంగా లేవని ఈ నివేదిక సూచించింది. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం-2019 లింగమార్పిడి వ్యక్తులకు వివిధ హక్కులను మంజూరు చేసినప్పటికీ, అది విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లను అందించడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా, పిటిషనర్లు కోరినట్లుగా ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని హైకోర్టుల్లో అనేక రిట్ పిటిషన్లు దాఖలయ్యాయని పిటిషన్‌రు పేర్కొన్నారు. అయినప్పటికీ, లింగమార్పిడి వ్యక్తులకు అటువంటి రిజర్వేషన్లను నిర్ధారించడానికి ఇంతవరకు ఎటువంటి కచ్చితమైన చర్యలు తీసుకోలేదని పిటిషన్ పేర్కొంది. అదనంగా, లింగమార్పిడి వర్గం సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉందని అనేక అధ్యయనాలు, నివేదికలు నిరూపిస్తున్నాయని తెలిపింది. అందువల్ల, రిజర్వేషన్ల కోసం నిబంధనలను అమలు చేయడంతో వారి విపత్కర పరిస్థితులను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ పిటిషన్‌ను న్యాయవాది తులసి కె రాజ్ డ్రా చేయగా, న్యాయవాది కాళేశ్వరం రాజ్ సెటిల్ చేశారు. న్యాయవాది మహ్మద్ సాదిక్ టిఎ ఈ పిటిషన్ దాఖలు చేశారు.

ఐఎఎస్ శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓబులాపురం మైనింగ్ కేసులో ఐఎఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మికి అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మికి క్లీన్‌చిట్ ఇస్తూ సిబిఐ నమోదు చేసిన అభియోగాలను కొట్టేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును సిబిఐ ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.

గనుల కేటాయింపుల్లో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి లబ్ధి చేశారని శ్రీలక్ష్మిపై ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి ఉన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసుల్లోనూ ఆమె ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పెన్నా సిమెంట్స్‌కు అక్రమంగా లబ్ధి చేకూర్చిన కేసులో జగన్‌తోపాటు శ్రీలక్ష్మి నిందితురాలిగా ఉన్నారు. పెన్నా సిమెంట్స్ కేసులో జగన్, ధర్మాన ప్రసాదరావు, పెన్నా ప్రతాప్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డితోపాటు అభియోగాలు ఎదుర్కొంటున్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో అనంతపురంలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఓబులాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సిబిఐ కేసులు నమోదు చేసింది. అక్రమంగా మైనింగ్ లైసెన్సులు మంజూరు చేశారని శ్రీలక్ష్మిపై సిబిఐ అభియోగాలు మోపింది. గాలి జనార్ధన్‌రెడ్డికి చెందిన ఓఎంసి కంపెనీకి లైసెన్సుల మంజూరులో శ్రీలక్ష్మి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించింది. 1988 బ్యాచ్‌కు చెందిన శ్రీలక్ష్మి అక్రమ మైనింగ్ కేసులో 2011లో అరెస్టయ్యారు. సిబిఐ ట్రయల్ కోర్టులో శ్రీలక్ష్మికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. ఆ తీర్పును ఆమె తెలంగాణ హైకోర్టులో సవాల్ చేయగా, ఆమెపై అభియోగాలు కొట్టేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సిబిఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఈ మేరకు ధర్మాసనం శ్రీలక్ష్మికి నోటీసులు జారీ చేసింది.

మణిపూర్ హింసాకాండ కేసులు అస్సాంలో విచారణ

న్యూఢిల్లీ : మణిపూర్ హింసాకాండ కేసులు విచారణ ఇక నుంచి అస్సాంలో జరగనుంది. కేంద్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సుప్రీంకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. సిబిఐ దర్యాప్తు చేస్తున్న మణిపూర్ హింసాకాండ కేసులను అస్సాంకు బదిలీ చేసినట్లు వెల్లడించింది. ఇక నుంచి ఈ కేసుల విచారణ అస్సాంలోనే కొనసాగనుందని తెలిపింది. ఇందుకోసం ఒకరు లేదా అంతకంటే ఎక్కువ న్యాయమూర్తులను ఎంపిక చేయాలని గౌహతి హైకోర్టుకు సూచించింది. మణిపూర్ హింసాకాండకు సంబంధించిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. నిందితులను కోర్టుముందు హాజరు పరచడం, రిమాండు, జ్యుడీషియల్ కస్టడీ వంటివి ఇక నుంచి గౌహతిలో కేటాయించిన కోర్టు నుంచి ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని పేర్కొంది. ఒకవేళ జ్యుడీషియల్ కస్టడీ విధిస్తే మాత్రం రవాణా ఇబ్బందుల దృష్ట్యా దాన్ని మణిపూర్‌లోనే జరిగేలా చూస్తామని తెలిపింది. ఈ కేసులతో సంబంధమున్న బాధితులు, సాక్షులతోపాటు ఇతరులు ఎవరైనా ఆన్‌లైన్‌లో ఇష్టం లేకుంటే నేరుగా గౌహతి కోర్టు ముందు హాజరుకావచ్చని తెలిపింది.

ట్రంప్ లొంగుబాటు

వాషింగ్టన్: 2024 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రిపబ్లికన్ పార్టీ నామినేషన్ కోసం జరుగుతున్న పోటీలో ముందున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలనం కోసం కొత్త జిమ్మిక్కు చేశారు. జార్జియాలో 2020 ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి యత్నించారన్న కేసులో ఆయన గురువారం అట్లాంటాలోని ఫుల్టన్ కౌంటీ జైలులో లొంగిపోయారు. ఇరవై నిమిషాల తరువాత 2 లక్షల డాలర్ల బాండ్‌పై విడుదలయ్యారు. నేరారోపణలపై ఆయన ఇలా జైలుకి రావడం ఇది నాల్గవ సారి. కానీ, ఇదివరకెన్నడూ లేని విధంగా ఆయన మగ్‌షాట్ (ఒక పథకం ప్రకారం ఫోటోకు పోజులిచ్చి దానిని ఎక్స్ (మునుపటి పేరు ట్విట్టర్)లో పోస్టు చేశారు. ట్వీట్ చేసిన ఆరు గంటల్లోనే 7 కోట్ల 60 లక్షల మంది వీక్షించారు. 8లక్షల లైక్‌లు కొట్టారు. లక్షా నలభై వేల వ్యాఖ్యలు వచ్చాయి. ట్రంప్ నాలుగు కేసుల్లో 91 నేరారోపణలను ఎదుర్కొంటున్నప్పటికీ, ఇది ఆయన ఎన్నికల అవకాశాలను లేదా రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ట్రంప్ మగ్‌ఫోటోలో ముఖ కవళికలు ప్రతీకారేచ్ఛ, యుద్ధానికి సిద్ధమన్న సంకేతాన్ని ఇచ్చేలా ఉన్నాయని మీడియా తెలిపింది. ఇలా మగ్‌షాట్ తో వార్తల్లోకి ఎక్కే యత్నం చేసిన తొలి అమెరికన్ నేతగా ట్రంప్ రికార్డుకెక్కారు. అవమానాన్ని కూడా రాజకీయ ప్రచార అవకాశంగా మార్చుకోవడం దిగజారుతున్న అమెరికా రాజకీయ ప్రమాణాలకు ఓ మచ్చు తునక అని సింగపూర్ యూనివర్శిటీ అంతర్జాతీయ భద్రత, వ్యూహ కేంద్రం రిసెర్చి స్కాలర్ సన్ చెంగావో వ్యాఖ్యానించారు. ట్రంప్ అనుచరుల సంగతి సరేసరి. ట్రంప్ జైలుకెళ్లడాన్ని ఏదో గొప్ప ఘనకార్యం సాధించినట్టుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది న్యాయవ్యవస్థకే అవమానమని సన్‌చెంగోవా పేర్కొన్నారు.



మీకోసం

ఎండు కొబ్బరి సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.

జీవన సౌరభం

సమస్యలు వచ్చినప్పుడే మనలోని శక్తిసామర్థ్యాలు తెలుస్తాయి.



జీవనమార్గం

అందమైన రంగుల ప్రపంచంలో
విహరింప చేస్తుంది
ఆనంద లోకంలో
ప్రయాణింపజేస్తుంది

ఆటపాటలతో
పాఠాలు నేర్పుతుంది
పసితనపు హృదయాలను
తాకే అనుభవాల
విజ్ఞానగని అవుతుంది

అమ్మఒడిని మైమరిపిస్తుంది
అనురాగ సన్నాయి మోగిస్తుంది
సీతాకోక చిలుకై
ఎగర మంటుంది

బడిగంట వినమంటుంది
సకాలంలో రమ్మటుంది
క్రమశిక్షణ అభివృద్ధికి సోపానమని
గుర్తుంచుకోమంటుంది

జీవన మార్గం చూపే
దివిటీ బడి అని తెలియ జేస్తుంది

– గాదిరాజు రంగరాజు,
87901 22275.

ఒత్తులు రాయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని ఒత్తులు ఇచ్చాం. కింద ఇచ్చిన అక్షరాల ఎదురుగా వాటి సరైన ఒత్తులను రాయండి చూద్దాం.

ఝ, ్వా, ్వ, ్శ, ్ర, ్ష, ్మ, ్య, ్ల, ్స, ్హ

భ –	వ –
మ –	శ –
య –	ష –
ర –	స –
ల –	హ –

నేను గీసిన బొమ్మ



కె. గ్రేస్ కుమారి
5వ తరగతి,
ఎంపిపిఎస్, చిల్లకల్లు, జగ్గయ్యపేట మండలం.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విజ్ఞానపథంలో ఇంతియానం..



జాబిలితో చెలిమి చేసేందుకు, చంద్రుని లోగుట్టు తెలుసుకునేందుకు ప్రయాణించింది చంద్రయాన్-3. లాండర్ విక్రమ్ చేసిన ఈ ప్రయాణంలో అసోసియేట్లుగా, డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్లగా, ప్రాజెక్టు మేనేజర్లుగా వివిధ విభాగాల్లో 54 మంది మహిళా శాస్త్రవేత్తలు సేవలు అందించడం నిజంగా గర్వకారణం. ఒకపక్క కుటుంబాన్ని చూసుకుంటూనే.. మరోపక్క విశ్వ రహస్యాలు ఛేదిస్తున్న ఆ మహిళల్లో కొందరి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

కల్పన కె



మన రాష్ట్రం చిత్తూరుకి చెందిన కల్పన కె, చంద్రయాన్-3 మిషన్‌లో కీలక భూమిక పోషించారు. 2003లో ఇస్రో సైంటిస్ట్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన కల్పన మొదట్లో శాటిలైట్ ప్రాజెక్టులకు పనిచేశారు. అక్కడ ఎన్నో ప్రాజెక్టుల విజయంలో ఆమె కృషి, పట్టుదల స్వల్పకాలంలోనే ఆమెను అంచెలంచెలుగా ఎదిగేలా చేసింది. 'మార్స్ ఆర్బిటార్ మిషన్' (మంగళయాన్)లో కల్పన ప్రదర్శించిన నైపుణ్యతే ఆమెను చంద్రయాన్-2 ప్రాజెక్టు డైరెక్టర్లలో ఒకరిగా ఎంపిక చేసింది. ఆ తరువాత చంద్రయాన్-3కి కూడా ప్రాజెక్టు డైరెక్టరుగా నియమితులై లాండర్ డిజైనింగ్ చేయడం, ఆప్టిమైజ్ చేయడంలో ప్రధాన భూమిక పోషించారు. చంద్రయాన్ విజయం తరువాత 'రోజుకో కొత్త సవాల్‌తో ఇక్కడ పనిచేస్తామని చెబుతూ, ఒక్కోసారి 14 గంటలు పనిచేసిన సందర్భాలు కూడా ఉన్నాయ'ని ఆమె చెప్పారు. ఈ ఒక్క విషయమే వారి కఠోర శ్రమకు, వృత్తినిబద్ధతకు అద్దం పడుతోంది.

రీతూ శ్రీవాస్తవ



'రాకెట్ మహిళ'గా పేరుగాంచిన రీతూ శ్రీవాస్తవ చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టరుగా విశేష సేవలు అందించారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన రీతూ లక్నో వాసి. ఐదుగురు సంతానంలో పెద్ద కూతురుగా ఇంటి బాధ్యతలు మోసిన రీతూ ఈ స్థాయికి ఎదిగేందుకు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొన్నారు. డిగ్రీ చదివే సమయానికే తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన రీతూపై తమ్ముళ్లు, చెల్లెళ్ల బాధ్యత పడింది. తోబుట్టువుల ఆలనాపాలనా చూసుకుంటూ చదువు సాగించిన రీతూ– 1997లో ఇస్రోలో ప్రస్థానం మొదలుపెట్టారు. 'చంద్రుడు రోజు రోజుకూ పెరుగుతూ, తగ్గుతూ ఉంటాడు. ఎందుకు?, 'సన్నగా ఉన్న చంద్రుడిలో మిగిలిన భాగం ఎక్కడికి వెళుతుంది? 'ఆకాశంలో ఒక రోజు కనిపించిన చుక్కలు మరో రోజు కనిపించవేంటి? 'ఆ చీకటిలో ఏం ఉంటాయి?' వంటి బాల్యంలో ఎదురైన ఎన్నో ప్రశ్నలు రీతూని శాస్త్రవేత్తగా ఎదిగేలా చేశాయి. ఇస్రోలో చేరిన తొలినాళ్లల్లో ఆపరేషన్ డైరెక్టర్‌గా వివిధ ప్రాజెక్టులకు పనిచేశారు. తన పరిశోధనలను ప్రచురించడంలో కూడా రీతూ ఎప్పుడూ ముందుంటారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే లక్ష్యంగా జాతీయంగా, అంతర్జాతీయంగా 20 వరకు పరిశోధనలను రచనల రూపంలో తీసుకువచ్చారు. అంతరిక్ష పరిశోధనా రంగానికి ఈ రచనలు ఎంతో దోహదం చేశాయి. రీతూ ప్రతిభ గురించి ఆమెకు వరించిన అవార్డులే చెబుతాయి. భారత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలామ్ చేతులమీదుగా 'ఇస్రో యువ శాస్త్రవేత్త' అవార్డు, 2015లో 'మామ్' అవార్డు, 'ఎఎస్ఐ టీమ్ అవార్డు', 2017లో 'ఉమెన్ అచీవర్ ఇన్ ఏరోస్పేస్' అవార్డులు ఆమె సొంతం చేసుకున్నారు.

మౌమితా దుత్తా



అహ్మదాబాద్ స్పేస్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న మౌమితా ఆప్టికల్, ఇన్‌ఫ్రారెడ్ (ఐఆర్), సెన్సార్లు, పేలోడ్ డెవలప్‌మెంట్, టెస్టింగ్ కెమెరాలు, ఇమేజింగ్ స్పెక్ట్రోమీటర్ డొమైన్‌లో ప్రత్యేక నైపుణ్యం కలిగి వున్నారు. 'మామ్'లో ఆమె ఐదు ప్రతిష్టాత్మక విభాగాల్లో కీలకపాత్ర పోషించారు.

అనురాధ టికె



1982 నుండి ఇస్రోలో సేవలు అందిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త అనురాధ. ఇస్రో శాటిలైట్ ప్రాజెక్టు డైరెక్టరుగా ఎన్నికైన మొట్టమొదటి మహిళగా చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. జి సాట్-12, జి సాట్-10 శాటిలైట్ల విజయవంత ప్రయాణంలో అనురాధ పాత్ర ఎంతో ఉంది.

ముత్తయ్య వనిత

చెన్నైకి చెందిన వనిత ఇస్రోలో జూనియర్ ఇంజినీర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ప్రాజెక్టు డైరెక్టరుగా ఉన్న వనిత 2006లో ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. 'చంద్రయాన్-2' ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా అవకాశం వచ్చినప్పుడు. మొదట్లో



సందేహించాను. కానీ తరువాత దాన్ని సవాల్‌గా తీసుకున్నాను. జీవితం మన మీద సవాళ్ళు విసిరినప్పుడు, వాటిని ఎదుర్కొనే శక్తి సామర్థ్యాలను కూడా అదే ఇస్తుంది. ఆ సవాల్‌ను నేను ఎంతగానో ఆస్వాదించాను' అని ఓ సందర్భంలో ఆమె చెప్పారు. 'చంద్రయాన్-3'లో ఆమె కీలక పాత్ర పోషించారు. 2006లో అస్ట్రనామికల్ సొసైటీ నుంచి బెస్ట్ ఉమన్ సైంటిస్ట్ అవార్డుతో సహా పలు పురస్కారాలను అందుకున్న ఆమె 'నాకు వంట పని ఇష్టం. కేక్స్ చేస్తాను, కొత్త కొత్త వంటకాలు ట్రై చేస్తాను. పూల మొక్కలతో పాటు, అల్లం, కొత్తిమీర లాంటివి పెంచుతూ ఉంటాను' అంటూ తన వ్యక్తిగత జీవితం గురించి చెబుతున్నప్పుడు ఓ సాధారణ గృహిణి ఆమెలో కనపడుతోంది.


నందినీ హరినాథ్



శాస్త్రవేత్తగా, ఇంజినీర్‌గా నందిని వివిధ విభాగాల్లో ఇస్రోలో సేవలు అందించారు. మంగళయాన్ మిషన్‌లో కీలకభూమిక పోషించిన ఆమె తాజా ప్రాజెక్టులో కూడా విశేష సేవలు అందించారు. ఇంకా మినాల్ రోహిత్, విఆర్ లలితాంబికా వంటి మహిళా శాస్త్రవేత్తలు ఇస్రో తొలినాళ్ల నుండి విధులు నిర్వహిస్తున్నారు.


'మహిళలు ఎక్కువ కష్టపడలేరు. పరిమిత గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికే ప్రాధాన్యత ఇస్తారు. అంకిత భావం ఉండదు' వంటి తప్పుడు భావనలకి ఈ మహిళలు చరమగీతం పాడారు. సైన్సు రంగంలో మహిళల భాగస్వామ్యం అంతగా లేని ఆ రోజుల్లో ఈ మహిళలు ఎదుర్కొన్న ఇబ్బందులు ఎన్నో ఉండే ఉంటాయి.. అయినా వాటన్నింటినీ ఎదుర్కొని వీరు సాగించిన ఈ ప్రయాణం ఎంతోమంది మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒకప్పుడు ఇస్రోలో పదుల సంఖ్యలో కూడా లేని మహిళల భాగస్వామ్యం ఇప్పుడు ఆశించిన స్థాయికి చేరుకుంటోంది. వారిలో యువ శాస్త్రవేత్తలు కూడా ఉన్నారు. వీరు సాధిస్తున్న ఈ విజయాలు మున్ముందు మరిన్ని విజయకేతనాలు ఎగురవేస్తాయనడంలో సందేహం లేదు.

7న ప్రభాస్ 'సలార్' విడుదల



హీరో ప్రభాస్ నటించిన సలార్ సినిమా సెప్టెంబర్ ఏడోతేదీన విడుదల చేయనున్నట్టు సమాచారం. కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తికాగా ఇటీవల టీజర్ కూడా విడుదలయ్యింది. తాజాగా ట్రైలర్ విడుదలకు చిత్రనిర్మాతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మూవీని రెండు భాగాలుగా తెరకెక్కించాలని డైరెక్టర్ భావిస్తున్నారు. ముందు మొదటి భాగం వస్తుంది. రెండో భాగానికి మరి కొంతకాలం పట్టే అవకాశం ఉంది. ఇక, ఈ సినిమాలో జగపతి బాబు విలన్ పాత్ర పోషిస్తున్నారు. కేజీఎఫ్‌లో లాగా, ఇందులోనూ చాలామంది విలన్స్ ఉండే అవకాశం ఉందని సమాచారం. బాలీవుడ్ డైరెక్టర్ వివేక్ అగ్ని హోత్రి దర్శకత్వం వహించిన వ్యాక్సిన్ మూవీ పోటీ పడుతోంది. ఇది కూడా సెప్టెంబర్ 28వ తేదీనే ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రుతి హాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ మూవీ తర్వాత ప్రభాస్ ప్రాజెక్ట్ కె కూడా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది.

ప్రముఖ నటుడు సఫాయ్ మృతి



ప్రముఖ మరాఠీ నటుడు మిలింద్ సఫాయ్(53) కన్ను మూశారు. క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఆయన శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి నటుడు జయవంత్ వాడ్కర్ సంతాపం తెలిపారు. మిలింద్ సఫాయ్ మరాఠీ టీవీ సీరియల్ 'ఆయ్ కుతే కే కర్తే' ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మేకప్, థాంక్ యు విఠలా, పోస్టర్ బాయ్స్, చడీ లగే చమ్ చమ్, ప్రేమచి గోష్టా, టార్గెట్, బి పాజిటివ్ వంటి చిత్రాల్లో కూడా నటించారు. గురువారంనాడు ప్రముఖ మరాఠీ నటి సీమా డియో సైతం ముంబైలో తుది శ్వాస విడిచారు. ఆమె చాలా కాలంగా అల్జీమర్స్ వ్యాధితో పోరాడుతోంది.

అల్లు అర్జున్‌కు అవార్డు గర్వంగా ఉంది : బాలయ్య




అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు రావడం, ఒక నటుడుగా తనకు చాలా గర్వంగా ఉందని సినీనటుడు నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. చలన చిత్ర రంగానికి కూడా ఇది గర్వకారణం అని ఆయన పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాకి ఆరు, ఏడు అవార్డులు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ వచ్చింది, ఇప్పుడు జాతీయ అవార్డులు కూడా వచ్చాయని, అదేవిధంగా ఉప్పెన మూవీకి అవార్డు రావడం కూడా చాలా సంతోషంగా అనిపించిందని చెప్పారు. ఈ అవార్డులు వచ్చినవారందరికీ తాను శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని బాలకృష్ణ చెప్పారు.



బన్నీకి హృదయపూర్వక అభినందనలు : రష్మిక

'పుష్ప' చిత్రంలో నటనకు అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా 69వ జాతీయ చలనచిత్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఈ ప్రత్యేక సందర్భంలో రష్మిక మందన్న తన సహనటుడు అల్లు అర్జున్‌కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ చిత్రంలో పుష్పరాజ్‌ని ప్రేమించి పెళ్లాడే ఇష్టసఖి శ్రీవల్లిగా రష్మిక నటించిన సంగతి తెలిసిందే. గురువారం నాడు ప్రకటించిన జాతీయ చలనచిత్ర అవార్డుల్లో అల్లు అర్జున్ విక్టరీపై రష్మిక మందన్న ఆనందం వ్యక్తం చేసింది. ఉల్లాసంగా ఉరుములతో కూడిన చప్పట్లతో నిండిన గదిలో బన్ని ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్న వీడియోను రష్మిక రీషేర్ చేసింది. బన్నీకి హృదయపూర్వక అభినందనలు తెలిపింది. తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో "పుష్పరాజ్.. అసలు తగ్గేదేలే..అభినందనలు.. ఇది పార్టీ టైమ్" అని వ్యాఖ్యానించింది.

అక్టోబరు 19న 'ఘోస్ట్'



కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ తాజా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని ఈ ప్రాజెక్టుకు దర్శకత్వం వహిస్తున్నారు. సందేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. తాజాగా ఈ చిత్రం విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. అక్టోబర్ 19న ఈ సినిమా విడుదల కాబోతున్నట్లు ఆకట్టుకునే పోస్టర్‌ని రిలీజ్ చేశారు. అలాగే శివ రాజ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర టీజర్‌ను కూడా ప్రత్యేకంగా విడుదల చేసారు. అర్జున్ జన్య ఈ సినిమాకు సంగీతం అందించారు. అనుపమ్ ఖేర్, జయరామ్, ప్రశాంత్ నారాయణ్, అర్చన జాయిస్, సత్య ప్రకాష్, దత్తన్న ముఖ్య పాత్రల్లో కనిపిస్తారు. కన్నడ, తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం భాషల్లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకి రానుంది.

ఈ రోజే 'ఖుషీ' ఐదో సింగిల్



విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటిస్తున్న 'ఖుషి' చిత్రం నుండి ఈ రోజు (ఆగస్టు 26న) ఐదో పాట విడుదలవుతున్నట్లు నిర్మాణసంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. దీనికి సంబంధించిన ప్రోమోని శుక్రవారం విడుదలచేసింది. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రం సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది. హేషమ్ అబ్దుల్ వాహబ్ ఖుషి సినిమాకు సంగీతం అందిస్తున్నారు. 'కశ్మీర్‌లో ఫస్ట్ టైమ్ తనని చూసినా.. ముందెనక సూడకుండా మనసిచ్చినా' అంటూ మొదలైన ఈ పాటను మెలోడీలా కాకుండా కాస్త డిఫరెంట్‌గా స్వరపరిచారు. రాహుల్ సిప్లిగంజ్, సాకేత్ పాడారు. తెలుగులో ఈ పాటకు శివ నిర్వాణ రిలిక్స్ అందించారు.

జావెలిన్ త్రో ఫైనల్‌కు నీరజ్..

- పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత
- పతక పోటీకి మను, కిషోర్ కూడా..
- ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



బుడాపెస్ట్(హంగేరీ): భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జావెలిన్ త్రో విభాగంలో ఫైనల్‌కు చేరాడు. శుక్రవారం జరిగిన గ్రూప్-ఎ జావెలిన్ త్రో క్వాలిఫయర్స్‌లో విభాగంలో తొలి ప్రయత్నంలోనే 88.77మీటర్లు త్రోయర్ చేసి నీరజ్ ఫైనల్లో చోటు దక్కించుకున్నాడు. ఫైనల్‌కు చేరడం ద్వారా 2024 పారిస్ ఒలింపిక్స్‌కూ బెర్త్ సాధించాడు. ఇక గ్రూప్‌లో అర్షాద్ నదీమ్(పాకిస్తాన్) 86.79మీ., జాకబ్ విడ్లెచ్(చెక్) 83.50మీ. రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఇక భారత్‌కే చెందిన డిపి మను (81.31మీ., కిషోర్ జెనా (80.55మీ.) ఒలింపిక్ కటాఫ్ మార్క్ 83మీటర్లను చేరుకోకున్నా ఫైనల్‌కు చేరారు. మను తొలి రౌండ్‌లో 78.10 మీటర్లు విసరగా.. రెండో ప్రయత్నంలో 81.31 మీటర్లు విసిరాడు. మూడో ప్రయత్నంలో 72.40 మీటర్లకు పడిపోయాడు. అయితే గ్రూప్-ఎ నుంచి నీరజ్ క్వాలిఫై కాగా.. జర్మనీకి చెందిన జులియన్ వెబర్ (82.39 మీటర్లు), మను (81.31 మీటర్లు) తర్వాతి స్థానాల్లో నిలిచారు. గ్రూప్-బి నుంచి పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ అగ్రస్థానంతో అర్హత సాధించాడు. ఆదివారం జావెలిన్ త్రో ఫైనల్ జరగనుండగా మొత్తం 12మంది త్రోయర్లు పతకాలకు పోటీపడనున్నారు. వీరిలో ముగ్గురు భారతీయులు ఉండటం విశేషం. ఆదివారం జరగనున్న ఫైనల్‌లో హెలాండర్, వాద్లెచ్, డేవిడ్ వాగ్నెర్, నీరజ్ చోప్రా, ఆడ్రియన్ మార్డరె, ఇహాబ్ అబ్దుల్‌రహ్మాన్, అర్షద్ నదీమ్, డిపి మను, ఎడిస్ మటుసెవిస్, వెబర్, కిషోర్ జెనా, హెర్మన్ పోటీ పడనున్నారు. నీరజ్ చోప్రాకు వాద్లెచ్, వెబర్, అర్షద్ నదీమ్ నుంచి తీవ్ర పోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయి.



విజయానందంలో గోదావరి టైటాన్స్ క్రీడాకారులు

సెమీస్‌కు గోదావరి టైటాన్స్

ఉత్తరాంధ్ర లయన్స్‌పై విజయం

ప్రజాశక్తి - పిఎం పాలెం (విశాఖపట్నం)

అద్భుతమైన ఆటతీరుతో గోదావరి టైటాన్స్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) సీజన్ - 2లో సెమీస్‌కు చేరింది. ఉత్తరాంధ్ర లయన్స్ జట్టుతో విశాఖ పిఎం పాలెంలోని ఎసిఎ-విడిసిఎ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లకే విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచిన గోదావరి టైటాన్స్ ఫీల్డింగ్ ఎంచుకుంది. ఉత్తరాంధ్ర లయన్స్ 19.5 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. గోదావరి టైటాన్స్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. అనంతరం బ్యాటింగ్ బరిలోకి దిగిన గోదావరి టైటాన్స్ బ్యాట్స్‌మ్యాన్లు 18 ఓవర్లులో మూడు వికెట్ల నష్టానికి విజయ లక్ష్యాన్ని అందుకున్నారు. ఓపెనర్ బ్యాట్స్‌మ్యాన్‌గా దిగిన కెప్టెన్ సిఆర్ జ్ఞానేశ్వర్ 40 బంతుల్లో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లుతో 53 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మూడో స్థానంలో దిగిన హేమంత్ రెడ్డి 53 బంతుల్లో మూడు సిక్స్‌లు, ఏడు ఫోర్లుతో 71 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. వీరిద్దరూ 93 బంతుల్లో 124 పరుగుల పార్టనర్‌షిప్‌తో జట్టును విజయంవైపు నడిపించారు.

ప్రజ్ఞానంద @ 20

ఫిడే చెస్ ర్యాంకింగ్స్



న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు ప్రజ్ఞానంద ఫిడే చెస్ ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) తాజాగా విడుదల చేసి ర్యాంకింగ్స్‌లో ప్రజ్ఞానంద కెరీర్ బెస్ట్ 20వ ర్యాంక్‌కు ఎగబాకాడు. ఇటీవల ముగిసిన ప్రపంచకప్ చెస్ రన్నరప్‌గా నిలిచిన 18ఏళ్ల ప్రజ్ఞానంద 2727.2 పాయింట్లు సొంతం చేసుకున్నాడు. ప్రజ్ఞానందతో పాటు మరో ఇద్దరు భారతీయులు టాప్ 20లో చోటు దక్కించుకున్నారు. యువ గ్రాండ్‌మాస్టర్ గుకేశ్ 8వ స్థానంలో, విశ్వనాథన్ ఆనంద్ తొమ్మిదవ స్థానంలో ఉన్నారు. ఈ జాబితాలో ప్రపంచ చాంపియన్, నార్వేకు చెందిన మాగ్నస్ కార్ల్‌సన్ 2838.8 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్టం చేసుకున్నాడు.

అల్కరాజ్ ప్రత్యర్థి కూఫర్

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ డ్రా విడుదల

న్యూయార్క్: ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ అయిన యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ డ్రా విడుదలైంది. డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్‌కు టాప్‌సీడింగ్ దక్కింది. అల్కరాజ్ తొలిరౌండ్‌లో జర్మనీకి చెందిన కూపర్‌తో టైటిల్ వేటను మొదలు పెట్టనున్నాడు. ఇక 2వ సీడ్ జకోవిచ్‌కు మరో గ్రూప్‌లో చోటు దక్కింది. ఫైనల్‌కు చేరే క్రమంలో అల్కరాజ్ క్వార్టర్‌ఫైనల్లో సిన్నర్‌ను, జకోవిచ్ గ్రీక్‌కు చెందిన సిట్సిపాస్‌తో తలపడనున్నారు. గత ఏడాది జెన్నిక్ సిన్నర్‌తో సుమారు ఐదుగంటల 15నిమిషాలసేపు తలపడి టోర్నమెంట్ లాంగెస్ట్ మ్యాచ్‌గా రికార్డు నెలకొల్పింది. ఇక 2వ సీడ్ నొవాక్ జకోవిచ్, ఈ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను మూడుసార్లు చేజిక్కించుకున్నాడు. ఇప్పటికే 23 గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేజిక్కించుకున్న జకోవిచ్.. మరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలిస్తే అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గిన మార్గరెట్ కోర్టు(24) సరసన చేరనున్నాడు. క్వార్టర్‌ఫైనల్లో తలపడే సిట్సిపాస్ 7వ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు. రష్యాకు చెందిన మెద్వదేవ్‌కు 3వ, రుబ్లేవ్‌కు 8వ, సీడింగ్ లభించాయి. గత ఏడాది రన్నరప్ నార్వేకు చెందిన కాస్పర్ రూడ్‌కు 5వ సీడింగ్, హోల్గర్ రూనేకు 4వ ర్యాంక్‌తో యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ బరిలోకి దిగనున్నారు. ఈనెల 28నుంచి యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ప్రారంభం కానుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68